TGTEL/26/A2635

DD9 వార్త
వాస్తవాలు పలుకు
తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 02 | సంచిక: 62 | 15-07-2026 బుధవారం | పేజీలు: 08 | వెల: 3/-

## రాజకీయ లబ్ధి కోసమే కరువును కాళేశ్వరంతో ముడి పెడుతున్న బీఆర్ఎస్.


05




## పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ జ్వాలలు

- సౌదీ, హౌతీల మధ్య భీకర దాడులు, ప్రతిదాడులు
- అమెరికా అండ కోరిన ప్రిన్స్ సల్మాన్
- తిరుగుబాటుదారుల మధ్య ముదిరిన ఘర్షణ
- విమానాశ్రయాలే లక్ష్యంగా క్షిపణులు, డ్రోన్లతో దాడులు
- సనా ఎయిర్‌పోర్టుపై సౌదీ బలగాల బాంబుల వర్షం
- ఇరాన్ విమానం రాకతో మొదలైన సరికొత్త వివాదం
- ఆయుధాల తరలింపుపై సౌదీ అరేబియా అనుమానాలు
- ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ సంస్థపైనే నిఘా


02

## పెరిగిన ధరలపై కాంగ్రెస్ ఆగ్రహం

- జూన్‌లో 4.38 శాతానికి చేరిన ద్రవ్యోల్బణం
- సామాన్యుడి బడ్జెట్ అతలాకుతలమైంది
- కేంద్ర ప్రభుత్వంపై జైరాం రమేశ్ విమర్శలు
- బీజేపీ పాలనలో ధరల భారమేనని మండిపాటు
- గణాంకాలతో సహా మోదీ ప్రభుత్వాన్ని నిలదీసిన జైరాం
- సామాన్యుల కష్టాలపై ప్రధాని ఎప్పుడు నోరు విప్పుతారని ప్రశ్న

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

దేశంలో రోజురోజుకూ పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలపై కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. జూన్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం ఒక్కసారిగా 4.38 శాతానికి పెరగడంతో మోదీ ప్రభుత్వంపై విమర్శల దాడిని ముమ్మరం చేసింది. గత 12 ఏళ్లుగా కొనసాగుతున్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రభుత్వ పాలనలో ధరల పెరుగుదల కారణంగా దేశంలోని సామాన్య, మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్ పూర్తిగా అతలాకుతలమైందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మండిపడ్డారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) లో ఒక సుదీర్ఘమైన మిగతా 2లో..



# తెలంగాణ ప్రగతికి సరికొత్త రెక్కలు

- 2028 జూన్ 2 నాటికి వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల నిర్మాణం పూర్తి
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ
- ఢిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి వరుస భేటీలు
- తెలంగాణ విమానాశ్రయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ తో చర్చలు సఫలం
- రెండు ఎయిర్‌పోర్టుల పనులకు కేంద్రం పూర్తి సహకారం
- 2028 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాటికి ప్రారంభోత్సవ లక్ష్యం
- గడువులోగా పనులు పూర్తి చేస్తామని ఇరుపక్షాల వెల్లడి
- వరంగల్ విమానాశ్రయానికి అంతర్జాతీయ హంగులు
- రక్షణ రంగానికి అత్యంత కీలకమైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్
- దేశ ఆర్థిక ప్రగతిలో భాగస్వామ్యం కానున్న తెలంగాణ
- రాష్ట్ర జీడీపీ వాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యమన్న సీఎం



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక, ఆర్థిక ప్రగతికి విమానాశ్రయాల విస్తరణ ఎంతో అవసరమని గుర్తించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు. తన దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ అత్యంత బిజీగా గడుపుతున్నారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక పెండింగ్ ప్రాజెక్టుల సాధనే లక్ష్యంగా కేంద్ర రహదారి రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై వారితో విస్తృతంగా చర్చించారు. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, ఉన్నతాధికారులతో జరిపిన చర్చలు అత్యంత సానుకూల వాతావరణంలో ముగిశాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల పునరుద్ధరణ, నిర్మాణ పనులపై ఈ సమావేశంలో ఒక స్పష్టమైన అవగాహన కుదిరిందని చెప్పారు. తాను ఎప్పుడు విమానాశ్రయాల ఏర్పాటు గురించి ప్రస్తావించినా, మిగతా 2లో..

## బోనాల పండుగలకు నిధులు విడుదల

- రాజధానిలో వైభవంగా ఆషాఢ బోనాల జాతర!
- తెలంగాణ వైభవానికి ప్రతీకగా ఆషాఢ బోనాలు
- జూలై 16 నుంచి నెల పాటు ఆధ్యాత్మిక శోభ
- ప్రధాన ఆలయాల్లో మొదలైన ఏర్పాట్లు
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు
- గోల్కొండతో మొదలై లాల్‌దర్వాజా వరకు
- బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం
- మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో సాగనున్న వైభవం
- 3,427 ఆలయాలకు రూ.15 కోట్ల నిధుల విడుదల
- ఆలయాల అభివృద్ధి, నిర్వహణ కోసం భారీగా కేటాయింపులు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి, ఆచార సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే ఆషాఢ మాస బోనాల ఉత్సవాలను ఈ ఏడాది అత్యంత ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లోని ఆలయాలన్నీ భక్తజనంతో కిక్కిరిసిపోనున్నాయి. ఈ మహోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో, కన్నుల పండుగగా నిర్వహించేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు కలిసికట్టుగా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాయి.

లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఏ ఒక్కరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ, పోలీస్, దేవాదాయ, రోడ్లుభవనాలు, నీటి సరఫరా, మిగతా 2లో..



## సింగరేణి బొగ్గు గనులపై రాజకీయ రచ్చ

- బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలపై కిషన్‌రెడ్డి నిప్పులు
- సింగరేణి భరోసా యాత్రలో కిషన్‌రెడ్డి ఆగ్రహం
- భూపాలపల్లి వేదికగా గత, ప్రస్తుత పాలకులపై విమర్శలు
- కేసీఆర్ చేతుల్లో జేబు సంస్థగా మారిన సింగరేణి
- పదిహేనేళ్లు వెనక్కి నెట్టేసారంటూ కేంద్రమంత్రి ఆరోపణ
- కార్మికుల కష్టార్జితాన్ని లూటీ చేశారంటూ కిషన్‌రెడ్డి మండిపాటు
- సొంత నియోజకవర్గాలకే సింగరేణి నిధుల మళ్లింపు
- బొగ్గు గనుల ప్రాంతాల నిర్లక్ష్యంపై తీవ్ర ధ్వజం



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ గుండెకాయ లాంటి సింగరేణి బొగ్గు గనుల రక్షణే ధ్యేయంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) చేపట్టిన 'సింగరేణి భరోసా యాత్ర' రెండో రోజుకు చేరుకుంది. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన ఈ భారీ బహిరంగ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మిగతా 2లో..

## 2027 గోదావరి పుష్కరాలు ఘనంగా నిర్వహిస్తాం..

- ధర్మపురి, కోటిలింగాల అభివృద్ధికి తొలి విడతగా రూ.117 కోట్లు
- భక్తులకు అన్ని సౌకర్యాలతో ముందస్తు ఏర్పాట్లు
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

2027 గోదావరి పుష్కరాలను దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా అత్యంత వైభవంగా నిర్వహిస్తామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. పుష్కరాల ఏర్పాట్లను మిగతా 2లో..



## కాళేశ్వరం వైఫల్యం బీఆర్ఎస్ పాపమే

- నిపుణులు చెబితేనే నీళ్లు నింపుతాం
- మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజం
- బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు
- కాంగ్రెస్ రాకముందే కుంగిన కాళేశ్వరం
- గత పాలకుల నిర్లక్ష్యమే కారణమన్న మంత్రి
- బీఆర్ఎస్ కుట్రలను ప్రజల ముందు ఎండగడతాం
- ఊరూరా తిరుగుతూ వాస్తవాలు వివరిస్తామని వెల్లడి




**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణలో నీటి పారుదల ప్రాజెక్టులు, కరవు పరిస్థితులపై అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ వేడి ముదిరింది. మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. విపక్ష బీఆర్ఎస్ పార్టీ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కరవు పరిస్థితులు, రైతుల ఇబ్బందులను ఆసరాగా చేసుకుని బీఆర్ఎస్ నాయకులు చౌకబారు రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. రక్తం ప్యాకెట్లతో డ్రామాలు ఆడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించాల్సిన అవసరం తమకు లేదని, కేవలం ఉనికిని కాపాడుకోవడానికే విపక్షాలు ఇలాంటి మిగతా 2లో..

## పెరిగిన ధరలపై కాంగ్రెస్ ఆగ్రహం

**మొదటిపేజీ తరువాయి**

పోస్ట్ చేస్తూ కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు. బీజేపీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలనలో దేశ ప్రజలకు తప్పుడు హామీలు ఇవ్వడం మాత్రమే పెరిగిందని జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో మాత్రం ద్రవ్యోల్బణం, తీవ్రమైన నిరుద్యోగం రూపంలో సామాన్య ప్రజలపై ప్రభుత్వం పెను భారాన్ని మోపిందని విమర్శించారు. ప్రభుత్వ అధికారిక గణాంకాలే జూన్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం ఏకంగా 17 నెలల గరిష్ఠ స్థాయికి చేరినట్లు స్పష్టంగా చూపిస్తున్నాయని ఆయన గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా ప్రజలు ధరల పెరుగుదలతో ఇంతలా ఇబ్బందులు పడుతుంటే, ప్రధాని నరేంద్ర మోదీ దీనిపై ఎప్పుడు స్పందిస్తారని, సామాన్యుల కష్టాల గురించి ఎప్పుడు మాట్లాడతారని జైరాం రమేశ్ సూటిగా ప్రశ్నించారు. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) తాజాగా విడుదల చేసిన నివేదికల ప్రకారం, మే నెలలో 3.93 శాతంగా నమోదైన వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం, జూన్ వచ్చేసరికి ఒక్కసారిగా 4.38 శాతానికి పెరిగింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నిర్దేశించుకున్న 4 శాతం ద్రవ్యోల్బణ నియంత్రణ లక్ష్య మార్కును ఇది దాటడం గమనార్హం. జనవరి నెల నుంచి అమల్లోకి వచ్చిన 2024 ప్రాతిపదిక సంవత్సరపు కొత్త శ్రేణి లెక్కల ప్రకారం, ద్రవ్యోల్బణం ఈ 4 శాతం మార్కును అధిగమించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం ఈ స్థాయిలో పెరగడానికి ప్రధాన కారణం ఆహార వస్తువుల ధరలు విపరీతంగా పెరగడమేనని ప్రభుత్వ అధికారులు సైతం అంగీకరిస్తున్నారు. మే నెలలో 4.78 శాతంగా ఉన్న ఆహార ద్రవ్యోల్బణం, జూన్ నాటికి 5.32 శాతానికి చేరింది. ముఖ్యంగా వెండి, బంగారం, వజ్రాలు వంటి ఆభరణాలతో పాటు వంటింట్లో నిత్యం వాడే అల్లం, టమాటా, కిస్మిస్ వంటి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకాయి. మరోవైపు బంగాళాదుంప, బఠానీలు, జీలకర్రతో పాటు కార్లు, మోటార్‌సైకిళ్లు, స్కూటర్ల ధరల పెరుగుదల వేగం కొంత తక్కువగా నమోదైనట్లు ఎన్ఎస్ఓ తన నివేదికలో వెల్లడించింది.

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలను పరిశీలిస్తే ధరల పెరుగుదల ప్రభావం పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాలపైనే చాలా ఎక్కువగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. దేశవ్యాప్తంగా సగటు రిటైల్ ద్రవ్యోల్బణం 4.38 శాతంగా ఉంటే, పల్లెటూళ్లలో ఇది ఏకంగా 4.74 శాతంగా నమోదైంది. అదే సమయంలో పట్టణ ప్రాంతాలలో ద్రవ్యోల్బణం రేటు 3.92 శాతంగా ఉంది. ఈ లెక్కలను బట్టి చూస్తే, ఆర్థికంగా వెనుకబడిన గ్రామీణ ప్రజలు నిత్యావసర వస్తువులను కొనుగోలు చేయడానికి పట్టణ వాసుల కంటే ఎక్కువ డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోందని తెలుస్తోంది.

ద్రవ్యోల్బణం గరిష్ఠ స్థాయికి చేరడం వల్ల భవిష్యత్తులో దేశంలో బ్యాంకు వడ్డీ రేట్లు కూడా మరింత పెరిగే ప్రమాదం ఉందని జైరాం రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. అదే గనుక జరిగితే, బ్యాంకుల నుంచి గృహ రుణాలు (హోమ్ లోన్స్), వాహన రుణాలు తీసుకున్న మధ్యతరగతి ప్రజల నెలవారీ ఈఎంఐలు మరింత భారం కానున్నాయని హెచ్చరించారు. ఇప్పటికే ధరల దెబ్బకు సతమతమవుతున్న సామాన్యులపై ఈ వడ్డీ రేట్ల పెంపు అనేది కోలుకోలేని అదనపు భారంగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు. దేశంలో ఒకవైపు సామాన్య ప్రజలు రోజువారీ ఖర్చులకే ఇబ్బంది పడుతుంటే, పెద్ద పెద్ద పారిశ్రామిక వర్గాలు మరియు కార్పొరేట్ సంస్థల లాభాలు మాత్రం విపరీతంగా పెరుగుతున్నాయని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కేవలం బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలకు, వారి లాభాలకు మాత్రమే అండగా నిలుస్తోందని మండిపడ్డారు. ధరల భారాన్ని మాత్రం ఏమీ లేని సామాన్య ప్రజల నెత్తిన రుద్దుతున్నారని, ఇదెక్కడి న్యాయమని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ విధానాలన్నీ సామాన్యుడిని దోచి కార్పొరేట్లకు పెట్టేలా ఉన్నాయని విమర్శించారు. ద్రవ్యోల్బణంతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ అవినీతి వ్యతిరేక వైఖరిని కూడా జైరాం రమేశ్ తీవ్రంగా తప్పుపట్టారు. ప్రధాని పదవి చేపట్టే సమయంలో మోదీ ఇచ్చిన హామీలన్నీ కేవలం బూటకపు మాటలేనని కొట్టిపారేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో 'కనీస పాలన.. గరిష్ఠంగా నిజాలను కప్పిపుచ్చే ధోరణి' మాత్రమే కనిపిస్తోందని విమర్శించారు. వివాదాస్పద ఎన్నికల బాండ్ల పథకం, రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు, గుజరాత్ పెట్రోలియం కార్పొరేషన్ ఆయిల్ వ్యవహారాలపై కేంద్రం నుంచి ఇప్పటికీ సరైన సమాధానాలు రాలేదన్నారు. అలాగే పీఎం కేర్స్ నిధి నిర్వహణలో ఎలాంటి పారదర్శకత లేదని, అయోధ్య రామమందిర విరాళాల కేసులోనూ పూర్తిస్థాయి పారదర్శకత అవసరమని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ పనితీరుపై కూడా కాంగ్రెస్ పార్టీ తరపున ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు.

## బోనాల పండుగలకు నిధులు విడుదల

**మొదటిపేజీ తరువాయి**

విద్యుత్, ఆర్టీసీ వంటి అన్ని విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి పనులను పర్యవేక్షిస్తున్నారు. ఆలయాల వద్ద క్యూ లైన్ల ఏర్పాటు, తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, రహదారుల మరమ్మతులు, ట్రాఫిక్ నియంత్రణ వంటి పనులను సకాలంలో పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు.

బోనాల ఉత్సవాలు జూలై 16న గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించడంతో ప్రారంభమవుతాయి. ఆగస్టు 2న సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనాలు, ఆగస్టు 3న రంగం కార్యక్రమం నిర్వహిస్తారు. ఇక ఆగస్టు 9న లాల్‌దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాలతో పాటు, నగరంలోని ప్రధాన ఆలయాల్లో జరిగే వేడుకల కోసం అద్భుతమైన ఏర్పాట్లు చేస్తున్నారు. పూల అలంకరణలు, విద్యుద్దీపాలంకరణలతో నగరం అంతా అమ్మవారి కోవెలలా మెరిసిపోనుంది.

బోనాల పండుగలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన బల్కంపేట శ్రీ ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవాలు జూలై 20, 21, 22 తేదీల్లో అత్యంత వైభవంగా జరగనున్నాయి. జూలై 20న ఎదుర్కోలు ఉత్సవం, 21న అత్యంత ఘనంగా అమ్మవారి కల్యాణం, 22న రథోత్సవం నిర్వహించబడుతుంది. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులు క్రమశిక్షణతో ఉత్సవాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

ఈ ఏడాది బోనాల పండుగ కోసం ప్రభుత్వం భారీగా నిధులను కేటాయించింది. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో పాత జీహెచ్ఎంసీ పరిధిలోని 3,427 దేవాలయాలకు రూ.15,05,41,150 కోట్లను విడుదల చేశారు. ఈ నిధులతో ఆలయాల మరమ్మతులు, భక్తులకు సౌకర్యాల కల్పనను వేగవంతం చేశారు. అమ్మవారికి సమర్పించే పట్టువస్త్రాలు, ఫలహారం బండ్ల ఊరేగింపు వంటి కార్యక్రమాలను కూడా ప్రభుత్వమే దగ్గరుండి పర్యవేక్షిస్తోంది. ప్రతి భక్తుడికి సురక్షితమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. అత్యధిక రద్దీ ఉండే ఆలయాల వద్ద ప్రత్యేక క్యూ లైన్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సదుపాయం కల్పిస్తున్నాం. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని పోలీస్ శాఖకు సూచించాం. పారిశుధ్య లోపం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా జీహెచ్ఎంసీ ప్రత్యేక బృందాలను సిద్ధం చేసింది. భక్తిప్రపత్తులతో పండుగను జరుపుకోవాలని కోరుతున్నాం.

గోల్కొండ జగదాంబ, ఉజ్జయిని మహంకాళి, కట్ట మైసమ్మ, అక్కన్నమాదన్న దేవాలయం, లాల్‌దర్వాజా సింహవాహిని, భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం వంటి నగరంలోని సుమారు 30 ప్రధాన దేవాలయాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు, ప్రజాప్రతినిధులు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఈ ప్రక్రియ అంతా అత్యంత సంప్రదాయబద్ధంగా జరుగుతుంది. పట్టువస్త్రాల సమర్పణ అనంతరం అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన ఫలహారం బండ్ల ఊరేగింపును వైభవంగా నిర్వహిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న టీజీఎస్ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం మహిళలకు గొప్ప వరం. ఈ సౌకర్యం వల్ల రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. మహిళా భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ఈ మహోత్సవాలను మరింత విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. భక్తులందరూ కలిసి తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెబుదామని ఆకాంక్షించారు.

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ జ్వాలలు

- **సౌదీ, హౌతీల మధ్య భీకర దాడులు, ప్రతిదాడులు**
- **అమెరికా అండ కోరిన ప్రిన్స్ సల్మాన్**
- **తిరుగుబాటుదారుల మధ్య ముదిరిన ఘర్షణ**
- **విమానాశ్రయాలే లక్ష్యంగా క్షిపణులు, డ్రోన్లతో దాడులు**
- **సనా ఎయిర్‌పోర్టుపై సౌదీ బలగాల బాంబుల వర్షం**
- **ఇరాన్ విమానం రాకతో మొదలైన సరికొత్త వివాదం**
- **ఆయుధాల తరలింపుపై సౌదీ అరేబియా అనుమానాలు**
- **ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ సంస్థపైనే నిఘా**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

పశ్చిమాసియా ప్రాంతంలో ఒక్కసారిగా యుద్ధ వాతావరణం నెలకొంది. ఇరాన్ దేశ మద్దతుతో పనిచేస్తున్న హౌతీ తిరుగుబాటుదారులకు, సౌదీ అరేబియాకు మధ్య దాడులు, ప్రతిదాడులు విపరీతంగా పెరిగిపోయాయి. ఇరుపక్షాలు పరస్పరం క్షిపణులు, అత్యాధునిక డ్రోన్లతో విరుచుకుపడుతున్నాయి. ముఖ్యంగా ఇరు దేశాల్లోని అంతర్జాతీయ విమానాశ్రయాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు సాగుతుండటంతో తీవ్ర కలకలం రేగుతోంది. ఈ తాజా ఘర్షణల్లో భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తున్నప్పటికీ, ప్రాణనష్టానికి సంబంధించిన వివరాలను సౌదీ అరేబియా ప్రభుత్వం ఇంకా అధికారికంగా వెల్లడించలేదు.

యెమెన్ దేశంలోని హౌతీల అదుపులో ఉన్న సనా అంతర్జాతీయ విమానాశ్రయంపై సౌదీ అరేబియా బలగాలు బాంబుల వర్షం కురిపించడంతోనే ఈ తాజా వివాదం మొదలైంది. ఇరాన్‌కు చెందిన 'మహాన్ ఎయిర్' అనే ఒక ప్రత్యేక విమానం సనా ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవ్వడమే ఇందుకు ప్రధాన కారణంగా మారింది. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమానికి హాజరైన హౌతీ ప్రతినిధులను తీసుకుని ఈ విమానం యెమెన్‌కు వచ్చినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ విమానం రాకను తీవ్రంగా పరిగణించిన సౌదీ.. అది తిరిగి వెళ్లే లోపే సనా రన్‌వేపై వైమానిక దాడులు జరిపి దాన్ని దెబ్బతీసింది.

మహాన్ ఎయిర్ విమానం ద్వారా ఇరాన్ నుంచి ప్రమాదకరమైన ఆయుధాలు, క్షిపణి విడిభాగాలు లేదా ఇరాన్‌కు చెందిన ప్రత్యేక సైనిక సిబ్బందిని యెమెన్‌కు తరలిస్తున్నారని సౌదీ అరేబియా బలంగా అనుమానించింది. అమెరికా నిఘా వర్గాల సమాచారం ప్రకారం, ఈ మహాన్ ఎయిర్ అనే సంస్థ ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ తో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉంది. అందుకే యెమెన్‌లోని అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రభుత్వం కూడా సౌదీ దాడులను సమర్థించింది. ఇరాన్ విమానం తమ భూభాగాన్ని వాడుకోకుండా అడ్డుకోవడానికే ఈ దాడులు చేసినట్లు స్పష్టం చేసింది. తమ ఆధీనంలో ఉన్న సనా ఎయిర్‌పోర్టుపై సౌదీ బలగాలు జరిపిన దాడులకు హౌతీలు కొన్ని గంటల్లోనే తీవ్ర ప్రతీకారం తీర్చుకున్నారు. సౌదీ అరేబియాలోని ప్రసిద్ధ 'అభా అంతర్జాతీయ విమానాశ్రయం'పై క్షిపణులు, ఆత్మాహుతి డ్రోన్లతో దాడులు చేశారు.

ఈ దాడుల అనంతరం హౌతీల సైనిక ప్రతినిధి యాహ్యా సరీ అంతర్జాతీయ విమానయాన సంస్థలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. సనా విమానాశ్రయంపై సౌదీ విధించిన ఆంక్షలను ఎత్తివేసే వరకు, సౌదీ గగనతలంలో ఎలాంటి విమానాలను నడపవద్దని చెప్పారు. రోగులను, సామాన్య ప్రజలను తరలించే విమానాలను అడ్డుకోవడానికే సౌదీ ఈ కుట్రలు చేస్తోందని ఆయన ఆరోపించారు.

యెమెన్‌లోని ఇరాన్ మద్దతుగల హౌతీ తిరుగుబాటుదారులను పూర్తిగా అణచివేయడానికి సౌదీ అరేబియా ప్రభుత్వం పెద్ద వ్యూహాన్నే సిద్ధం చేసింది. ఇందులో భాగంగానే, హౌతీలపై పూర్తి స్థాయి సైనిక చర్యలు ప్రారంభించడానికి ముందే సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో చర్చలు జరిపారు. ఈ సైనిక ఆపరేషన్‌కు అమెరికా మద్దతు ఇవ్వాలని కోరారు. ఒక అంతర్జాతీయ మీడియా నివేదిక ప్రకారం.. సౌదీ తీసుకునే ఈ చర్యలకు అధ్యక్షుడు ట్రంప్ కూడా అంగీకారం తెలిపినట్లు సమాచారం. అమెరికా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వెంటనే సౌదీ బలగాలు హౌతీల స్థావరాలపై విరుచుకుపడ్డాయి. సౌదీ అరేబియా, హౌతీల మధ్య మళ్లీ యుద్ధ వాతావరణం తలెత్తడంపై అంతర్జాతీయ సమాజం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ పరిణామాలను నిశితంగా గమనించిన ఐక్యరాజ్యసమితి (ఐరాస) భద్రతా మండలి అత్యవసరంగా సమావేశమైంది. యెమెన్‌తో పాటు మొత్తం పశ్చిమాసియా ప్రాంతం మరోసారి కోలుకోలేని విధంగా తీవ్ర ఘర్షణల వైపు వెళ్లే ప్రమాదం ఉందని ఐరాస రాజకీయ వ్యవహారాల సహాయ ప్రధాన కార్యదర్శి ఖాలిద్ ఖియారి హెచ్చరించారు. యుద్ధం వల్ల సామాన్య ప్రజలు నష్టపోతారని, కాబట్టి అన్ని పక్షాలు తక్షణమే దాడులు ఆపి ఐరాస ఆధ్వర్యంలో శాంతి చర్చలకు రావాలని పిలుపునిచ్చారు.

ప్రస్తుతం జరుగుతున్న దాడులు చూస్తుంటే గతంలో యెమెన్ దేశాన్ని కుదిపేసిన భయంకరమైన అంతర్యుద్ధం గుర్తుకు వస్తోంది. 2014లో హౌతీ తిరుగుబాటుదారులు యెమెన్ రాజధాని సనాను బలవంతంగా స్వాధీనం చేసుకోవడంతో అక్కడ పెద్ద ఎత్తున ఘర్షణలు ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత అక్కడి అధికారిక ప్రభుత్వానికి అండగా నిలిచేందుకు 2015లో సౌదీ అరేబియా నేతృత్వంలోని అరబ్ దేశాల కూటమి నేరుగా రంగంలోకి దిగింది. అప్పట్లో ఇరుపక్షాల మధ్య జరిగిన యుద్ధం వల్ల వేలాది మంది ప్రాణాలు కోల్పోగా, లక్షలాది మంది శరణార్థులుగా మారాల్సి వచ్చింది.

సుదీర్ఘ కాలం పాటు సాగిన యెమెన్ అంతర్యుద్ధానికి 2022లో ఐక్యరాజ్యసమితి మధ్యవర్తిత్వంతో తాత్కాలిక బ్రేక్ పడింది. ఇరుపక్షాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో, గత నాలుగేళ్లుగా ఆయా ప్రాంతాల్లో పరిస్థితులు ప్రశాంతంగా ఉన్నాయి. పెద్దగా ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోలేదు. కానీ, ఇప్పుడు ఇరాన్ విమానం రాకతో మొదలైన వివాదం కారణంగా ఆ కాల్పుల విరమణ ఒప్పందానికి పూర్తిగా తూట్లు పడ్డాయి. ఈ తాజా దాడుల వల్ల పశ్చిమాసియాలో శాంతి భద్రతలకు మళ్లీ పెను ముప్పు పొంచి ఉందని, దీనివల్ల ప్రపంచ ఇంధన సరఫరాపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## సింగరేణి బొగ్గు గనులపై రాజకీయ రచ్చ

**మొదటిపేజీ తరువాయి**



మాట్లాడుతూ తెలంగాణ ప్రగతికి ఊపిరిగా నిలిచిన సింగరేణి సంస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తమ స్వార్థ రాజకీయాల కోసం ఎలా వాడుకుంటున్నాయో ఆధారాలతో సహా వివరించారు. ఈ రెండు పార్టీల నిర్లక్ష్యం వల్ల సింగరేణి కార్మికులు ఈరోజు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) సింగరేణి సంస్థను తన సొంత జేబు సంస్థగా మార్చుకున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒకనాడు లాభాల బాటలో నడిచిన ఈ ప్రభుత్వ రంగ సంస్థ.. కేసీఆర్ తీసుకున్న తప్పుడు నిర్ణయాలు, అవినీతి విధానాల వల్ల ఏకంగా 15 సంవత్సరాలు వెనక్కి పడిపోయిందని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు, వారి అనుచరులు సింగరేణి కాంట్రాక్టులను దక్కించుకుని వేల కోట్ల రూపాయలను నిస్సిగ్గుగా దోచుకున్నారని, దీనివల్ల సంస్థ ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తిన్నదని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు.

తెలంగాణ బొగ్గు గనుల్లో రాత్రింబగళ్లు కష్టపడి పని చేస్తున్న కార్మికుల చెమట చుక్కలతో సింగరేణి లాభాలను గడిస్తోందని, కానీ పాలకులు మాత్రం ఆ సంస్థను తమ సొంత ఆస్తిలా భావిస్తున్నారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు గానీ, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పాలకులు గానీ సింగరేణిని తమ 'తాత జాగీరు' లాగా వాడుకుంటున్నారని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసి, సంస్థ నిధులను ఇతర అవసరాలకు తరలిస్తూ కార్మికుల నమ్మకాన్ని వమ్ము చేస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం సంస్థకు ఆశించిన స్థాయిలో లాభాలు లేకపోవడంతో కార్మికులు తమ భవిష్యత్తుపై తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు.

సింగరేణి సంస్థ ద్వారా వచ్చే లాభాలను, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను చట్టప్రకారం బొగ్గు గనులు ఉన్న ప్రాంతాల అభివృద్ధి కోసమే ఖర్చు చేయాల్సి ఉంటుంది. భూపాలపల్లి, కొత్తగూడెం, మంచిర్యాల వంటి ప్రాంతాల ప్రజల తాగునీరు, రోడ్లు, విద్య, వైద్య అవసరాల కోసం ఈ నిధులు వాడాలి. కానీ, గత కేసీఆర్ ప్రభుత్వం ఈ నిధులను సింగరేణి ప్రాంతంలో ఖర్చు చేయకుండా.. కేసీఆర్ కుటుంబ సభ్యులైన కేటీఆర్, హరీష్ రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల, సిద్ధిపేట, గజ్వేల్ వంటి సొంత నియోజకవర్గాలకు చట్టవిరుద్ధంగా మళ్లించారని కిషన్ రెడ్డి ఆరోపించారు. ఇది సింగరేణి ప్రాంత ప్రజలకు చేసిన ద్రోహమని ఆయన అన్నారు.

సింగరేణి సంస్థను మరింత విస్తరించి, లాభాల బాటలోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో కేంద్రంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం అదనంగా కొత్త కోల్ బ్లాకులను (బొగ్గు గనులు) కేటాయించినప్పటికీ, కేసీఆర్ ప్రభుత్వం వాటిని ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే కేంద్రం ఇచ్చిన అవకాశాలను బీఆర్ఎస్ సర్కార్ కాలరాసిందన్నారు. పైగా, సింగరేణి సమస్యలు లేదా అభివృద్ధి ప్రాజెక్టుల గురించి కేసీఆర్ తన పాలనా కాలంలో ఒక్కసారి కూడా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపలేదని కిషన్ రెడ్డి వెల్లడించారు.

కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వమే కాకుండా, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తోందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ పాలన ముగిసే సమయానికి తెలంగాణ జెన్‌కోకు కేవలం రూ.8,958 కోట్ల అప్పులు ఉంటే, ప్రస్తుతం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన కొన్ని నెలల్లోనే ఆ అప్పులు ఏకంగా రూ.26,875 కోట్లకు చేరుకున్నాయని అధికారిక గణాంకాలను బయటపెట్టారు. ఈ అప్పులను పూడ్చుకోవడానికి, కొత్తగా అప్పులు తెచ్చుకోవడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏకంగా అధికారులను, కేంద్ర సంస్థలను బెదిరించే స్థాయికి దిగజారిందని కిషన్ రెడ్డి విమర్శించారు.

సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసేందుకు కొందరు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని కిషన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి గనుల్లో నాణ్యమైన బొగ్గు లభించడం లేదని, ఇక్కడి బొగ్గు వాడకం లాభదాయకం కాదంటూ పనిగట్టుకుని చేస్తున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. ఇలాంటి ప్రచారం చేయడం వల్ల సంస్థ ప్రతిష్ఠ అంతర్జాతీయంగా దెబ్బతింటుందని, ఇది చాలా ప్రమాదకరమైన విషయమని హెచ్చరించారు. సింగరేణి బొగ్గుకు ఎంతో డిమాండ్ ఉందని, కేవలం ప్రభుత్వాల అసమర్థత వల్లే ఈ విధమైన వదంతులు వ్యాప్తి చెందుతున్నాయని, దీనివల్ల కార్మికుల్లో అభద్రతాభావం పెరుగుతోందని అన్నారు.

సింగరేణి సంస్థ మళ్లీ పూర్వ వైభవాన్ని సాధించాలంటే కొత్త బొగ్గు గనుల తవ్వకాలు వేగవంతం కావాలని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా తాడిచర్ల2 బొగ్గు బ్లాక్ అందుబాటులోకి వస్తే సింగరేణి సంస్థకు భారీగా లాభాలు చేకూరుతాయని, కార్మికుల ఉద్యోగ భద్రతకు ఢోకా ఉండదని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడానికి కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సింగరేణి కార్మికుల ప్రయోజనాల కోసం బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, భరోసా యాత్ర ద్వారా కార్మికుల గొంతుకగా నిలుస్తామని కిషన్ రెడ్డి భరోసా ఇచ్చారు.

## తెలంగాణ ప్రగతికి సరికొత్త రెక్కలు

**మొదటిపేజీ తరువాయి**

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తక్షణమే స్పందించి అధికారులను ఆదేశిస్తున్నారని కొనియాడారు. తెలంగాణ ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం అందుతోందని రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణ పనులను ఒక నిర్దిష్ట కాలపరిమితిలోగా పూర్తి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్ణయించాయి. వచ్చే 2028 జూన్ 2 నాటికి, అంటే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాటికి ఈ రెండు విమానాశ్రయాల పనులను వంద శాతం పూర్తి చేసి, అదే రోజు భక్తులు, ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని ఒక స్పష్టమైన లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు రేవంత్ రెడ్డి ప్రకటించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సైతం దీనిపై స్పందిస్తూ.. నిర్దేశిత గడువు లోపే విమానాశ్రయాల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

వరంగల్ (మామునూరు) విమానాశ్రయాన్ని కేవలం ఒక సాధారణ ఎయిర్‌పోర్ట్‌లా కాకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో అద్భుతంగా నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఓరుగల్లు వైభవాన్ని ప్రతిబింబించేలా, కాకతీయ సంస్కృతి, కళాఖండాల ఆకృతులతో ఈ విమానాశ్రయం యొక్క ప్రధాన కట్టడాలను డిజైన్ చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. దీనివల్ల వరంగల్ ప్రాంత పర్యాటక రంగానికి, పరిశ్రమల స్థాపనకు సరికొత్త ఊపు వస్తుందని, స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత రక్షణ రంగానికి (డిఫెన్స్) వ్యూహాత్మకంగా ఆదిలాబాద్ విమానాశ్రయం ఎంతో అవసరమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయి. ఈ ఎయిర్‌పోర్ట్ విస్తరణ మరియు పూర్తి స్థాయి నిర్మాణానికి గానూ రాష్ట్ర ప్రభుత్వం తరపున మరో 1500 ఎకరాల భూమిని సేకరించి కేంద్రానికి అప్పగించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సరిహద్దు జిల్లాలో ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే అటు సైనిక అవసరాలకు, ఇటు వెనుకబడిన ఆదిలాబాద్ ప్రాంత ఆర్థిక ప్రగతికి ఎంతో మేలు జరుగుతుందని ఇరుపక్షాలు అభిప్రాయపడ్డాయి.

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 'వికసిత్ భారత్' నినాదంతో 2045 నాటికి దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని పెద్ద లక్ష్యాన్ని పెట్టుకుందని, ఇందులో తెలంగాణ భాగస్వామ్యం వహిస్తుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశ జనాభాలో కేవలం 2.50 శాతం మాత్రమే ఉన్న తెలంగాణ, దేశ మొత్తం జీడీపీలో 5 శాతం వాటాను కలిగి ఉండటం గర్వకారణమన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలు రావాలంటే విమానాశ్రయాల అనుసంధానత చాలా ముఖ్యమని, అందుకే తెలంగాణ జీడీపీ వాటాను 5 శాతం నుండి 10 శాతానికి పెంచేలా ప్రణాళికలు రూపొందించామని సీఎం వివరించారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక 'ఉడాన్' పథకం కింద దేశవ్యాప్తంగా ప్రాంతీయ విమానయాన రంగాన్ని బలోపేతం చేసేందుకు రూ.30 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు కేంద్ర పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు ఈ సందర్భంగా వెల్లడించారు. ఇందులో భాగంగానే తెలంగాణలోని వరంగల్, ఆదిలాబాద్ ప్రాజెక్టులకు అవసరమైన నిధులు, సాంకేతిక అనుమతులు వేగంగా మంజూరు చేస్తామన్నారు. అభివృద్ధి పనుల విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సంపూర్ణంగా సహకరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా కేంద్రమంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాలు ఎలా ఉన్నా, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే ఏకైక లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహకార స్ఫూర్తి (ఫెడరల్ స్ఫూర్తి) నిరంతరం కొనసాగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేంద్రాన్ని డిమాండ్ చేసి, ఒప్పించి రాష్ట్రానికి రావలసిన నిధులను, ప్రాజెక్టులను సాధించుకుంటామన్నారు. రాబోయే పార్లమెంట్ సమావేశాల సమయంలో తాను మళ్లీ ఢిల్లీకి వస్తానని, ఆ సమయంలో మిగిలిన కేంద్ర మంత్రులను కూడా వ్యక్తిగతంగా కలిసి రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన మరిన్ని అంశాలపై చర్చిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియా ముఖంగా స్పష్టం చేశారు.



# కాళేశ్వరం వైఫల్యం బీఆర్ఎస్ పాపమే

**మొదటిపేజీ తరువాయి**

చీప్ పాలిటిక్స్ చేస్తున్నాయని తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందే కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందన్న పచ్చి నిజాన్ని ప్రతిపక్షాలు కావాలనే దాస్తున్నాయని పొన్నం ప్రభాకర్ విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఈ పరిస్థితికి రావడానికి, పిల్లర్లు కుంగిపోవడానికి పూర్తిగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి, అలసత్వమే కారణమని ఆరోపించారు. నాసిరకం నిర్మాణాలు, ఇంజినీరింగ్ లోపాల వల్లనే ఆ ప్రాజెక్టు దెబ్బతిన్నదని, ఆ పాపాన్ని ఇప్పుడు తమ ప్రభుత్వంపై నెట్టేందుకు గులాబీ నేతలు ప్రయత్నించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలను, బీఆర్ఎస్ నాయకులు చేసిన మోసాలను తాము ఊరూరా తిరిగి ప్రజలకు వివరిస్తామని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల సొమ్మును ఎలా వృథా చేశారో, ప్రాజెక్టు పేరిట ఏ విధంగా దోపిడీకి పాల్పడ్డారో వాస్తవాలతో సహా ప్రతి గ్రామంలోనూ ఎండగడతామన్నారు. ప్రజలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్న ప్రతిపక్షాల కుట్రలు ఇకపై సాగవని హెచ్చరించారు.

జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ తుది నివేదిక వచ్చిన తర్వాతే కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని నింపే విషయమై ప్రభుత్వం ఒక నిర్ణయానికి వస్తుందని మంత్రి వివరించారు. ఎన్‌డీఎస్ఏ నిపుణులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, ప్రాజెక్టు సురక్షితంగా ఉందని చెబితే వెంటనే నీటిని నింపుతామన్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా, శాస్త్ర సాంకేతిక నిపుణులు, అనుభవజ్ఞులైన ఇంజినీర్లు ఇచ్చే సలహాలను పాటిస్తూ బాధ్యతాయుతంగా ముందుకు సాగుతామన్నారు. ప్రాజెక్టు మళ్లీ పూర్తి స్థాయిలో ఉపయోగంలోకి రావడానికి ఏం చేయాలో నిపుణులు సూచిస్తే వాటిని తూచా తప్పకుండా అమలు చేస్తామని ప్రకటించారు. ప్రస్తుత కరవు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రజలలో ఆందోళన కలిగించేలా బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డ, కన్నెపల్లి పంప్‌హౌస్ విషయాల్లో కావాలనే రాజకీయం చేస్తూ రచ్చ సృష్టిస్తున్నారని విమర్శించారు. కరవు అనేది ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన సమస్య అని, దానిని అందరం కలిసి ఎదుర్కోవాలే తప్ప.. శవాల మీద పేలాలు ఏరుకున్న చందంగా రాజకీయం చేయడం తగదని హితవు పలికారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు ఇప్పటికే హెచ్చరించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. తీవ్రమైన ఎల్‌నినో ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా కరవు పరిస్థితులు నెలకొంటున్నాయని చెప్పారు. ఈ భయంకరమైన ప్రకృతి సవాలును ఎదుర్కోవడానికి ప్రభుత్వం వైపు నుంచి అన్ని రకాల ముందస్తు చర్యలు, నివారణ సూచనలు చేస్తున్నామని వెల్లడించారు. తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తుగా నిధులు కేటాయించి పనులను పర్యవేక్షిస్తున్నామన్నారు. తక్కువ నీటి వనరులతో పండే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ప్రస్తుత నీటి లభ్యత, కరవు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ అధికారులు ఇచ్చే సలహాలను పాటించాలన్నారు. నీటి వినియోగం తక్కువగా ఉండే పంటల సాగు ద్వారా నష్టాల నుంచి బయటపడవచ్చని, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని నిలబడేలా రైతాంగాన్ని చైతన్యపరుస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల మధ్య అంతర్గతంగా ఎన్ని విభేదాలు, సమస్యలు ఉన్నప్పటికీ.. కరవు వంటి సంక్షోభ సమయాల్లో అందరూ ఏకతాటిపైకి వచ్చి ప్రజలను ఆదుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా ప్రభుత్వానికి మంచి సలహాలు, సూచనలు ఇవ్వాలే తప్ప.. అనవసరపు రాద్ధాంతం చేయవద్దని హితవు పలికారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడానికి ప్రభుత్వం అన్ని శక్తులతో సిద్ధంగా ఉందని, ప్రజా ప్రయోజనాలే తమ ప్రథమ ప్రాధాన్యత అని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# 2027 గోదావరి పుష్కరాలు ఘనంగా నిర్వహిస్తాం..

**మొదటిపేజీ తరువాయి**

దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి ధర్మపురి, కోటిలింగాల పుణ్యక్షేత్రాల్లో మంగళవారం పరిశీలించారు.

**ఘాట్లు, రహదారులు, మౌలిక వసతులపై సమీక్ష**

ఈ సందర్భంగా వీఐపీ, సాధారణ స్నాన ఘాట్లు, బైపాస్ రోడ్లు, ట్రాఫిక్ నిర్వహణ, తాగునీరు, విద్యుత్, పార్కింగ్, మరుగుదొడ్లు తదితర సౌకర్యాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. అలాగే ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి, ఉగ్ర నరసింహస్వామి ఆలయాలు, కోటిలింగాల దేవస్థానం అభివృద్ధి పనులను పరిశీలించి, నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

**రూ.117 కోట్ల నిధులు... అదనంగా మరో ప్రతిపాదనలు**

గోదావరి పుష్కరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.1,000 కోట్లు కేటాయించగా, ధర్మపురి, కోటిలింగాల అభివృద్ధి పనులకు తొలి విడతలో రూ.117 కోట్లను మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. అదనంగా రూ.50-60 కోట్లతో వంతెన నిర్మాణం, ప్రత్యేక వీఐపీ ఘాట్, డబుల్ రోడ్డు వంటి పనులకు ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని వెల్లడించారు.

**బాసర నుంచి భద్రాచలం వరకు ప్రత్యేక ప్రణాళిక**

బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరం వెంబడి ఉన్న ప్రధాన పుణ్యక్షేత్రాల అభివృద్ధితో పాటు పుష్కరాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా చేపడుతున్నామని మంత్రి తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడంలో ఎలాంటి రాజీ ఉండదని, గోదావరి పుష్కరాలను విజయవంతం చేయడంలో ప్రజలందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. రాజగౌడ్, ఆర్‌డీఓ మధుసూదన్, దేవాదాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆలయ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# టీకాల ద్వారా నియంత్రించే వ్యాధులపై నిజామాబాద్‌లో జిల్లా స్థాయి శిక్షణ

**నిజామాబాద్ జిల్లా జూలై 14(డీడీ9 వార్త):**

నిజామాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టీకాల ద్వారా నియంత్రించే వ్యాధుల పర్యవేక్షణపై జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజశ్రీ మాట్లాడుతూ....వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలను మరింత పకడ్బందీగా అమలు చేయడమే లక్ష్యంగా ఈ శిక్షణ చేపట్టినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఎంపిక చేసిన ఎనిమిది పైలట్ జిల్లాల్లో నిజామాబాద్ ఒకటిగా నిలిచిందని, ఇకపై టీకాల ద్వారా నియంత్రించే వ్యాధులకు సంబంధించి సమాచారాన్ని జిల్లా కేంద్రంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలోనే 'వ్యాక్సిన్ ప్రివెంటబుల్ డిసీజెస్ సిస్టమేటిక్ ఇన్ఫర్మేషన్ మేనేజ్మెంట్ సిస్టం' పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి ట్రైనర్ ఆఫ్ ట్రైనీగా వ్యవహరించిన పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ, టీకాల ద్వారా నివారించగల వ్యాధుల తీవ్రతను తగ్గించడం, ఒకేసారి ఎక్కువ మందిలో వ్యాధులు ప్రబలే 'అవుట్‌బ్రేక్'లను సత్వరమే గుర్తించడం, ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనలకు అనుగుణంగా టీకాల నాణ్యతను సమీక్షించడం వంటి అంశాలపై వైద్యాధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలియో, మీజిల్స్, రూబెల్లా, డిఫ్తీరియా వంటి వ్యాధుల లక్షణాలు ఉన్న రోగులు ఒకే ప్రాంతంలో ఐదుగురికంటే ఎక్కువ నమోదయితే దానిని అవుట్‌బ్రేక్‌గా పరిగణించాల్సి ఉంటుందని తెలిపారు. అక్యూట్ ఫ్లసిడ్ పెరాలసిస్ కేసులను గుర్తించిన వెంటనే మలం నమూనాలను చర్మంపై దద్దుర్లతో కూడిన జ్వరం ఉంటే ముక్కు, గొంతు స్వాబ్ లేదా సీరం, మూత్రం నమూనాలను నిబంధనల ప్రకారం సేకరించి, ఆన్‌లైన్‌లో ఇన్వెస్టిగేషన్ ఫారమ్ నమోదు చేసి హైదరాబాద్‌లోని ఐపీఎంకు పంపించాలని సూచించారు. గత గణాంకాలను విశ్లేషిస్తే ఏఎఫ్‌పీ కేసులకు సంబంధించి ఏడాదికి పది లక్ష్యం కాగా, ఇప్పటివరకు రెండు శాంపిల్స్ పంపినట్లు, మీజిల్స్ రూబెల్లాకు సంబంధించి ఏడాదికి 35 లక్ష్యానికి గాను 22 నమూనాలను పంపిస్తే అందులో 14 పాజిటివ్ కేసులు నమోదైనట్లు వివరించారు. ఇదే కార్యక్రమంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ఆరోగ్య మహిళా అంశాలపై సమీక్షించారు. ఈ శిక్షణలో డిఐఓ డాక్టర్ అశోక్, ట్రైనర్లు డాక్టర్ అజ్మల్, డాక్టర్ శ్రావ్య, డిడిఎం పృథ్వి, జిల్లా ఉప వైద్యాధికారులు డాక్టర్ రవీందర్, డాక్టర్ విద్య, డాక్టర్ సికందర్ నాయక్, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శరణ్య, డాక్టర్ ప్రసన్న, ప్రోగ్రాం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# వైద్య కేంద్రాల్లో పకడ్బందీగా సేవలు అందించాలి

- **డీఎంహెచ్‌వో రాజశ్రీ**

**నిజామాబాద్ జిల్లా జూలై 14(డీడీ9 వార్త):**

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ స్పష్టం చేశారు. మంగళవారం ఆమె కమ్మర్‌పల్లి, చౌట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చౌట్‌పల్లిలో జరుగుతున్న 'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ఆమె, కార్యక్రమ తీరుతెన్నులను వైద్యాధికారి డాక్టర్ అసీనను అడిగి తెలుసుకున్నారు. ప్రతి మంగళవారం మహిళలకు తప్పనిసరిగా స్క్రీనింగ్ నిర్వహించాలని, రక్త పరీక్షలతో పాటు అన్ని రకాల వైద్య పరీక్షలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అనంతరం లాబొరేటరీ, ప్రసూతి గది, వార్డులను పరిశీలించి, రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. 'అమ్మఒడి' కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలని, ఇందుకోసం ఆరోగ్య కార్యకర్తలు గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వర్షాకాలం దృష్ట్యా మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆయా వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టడం ద్వారా అరికట్టవచ్చని సూచించారు. అనంతరం కమ్మర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో ఆర్మూర్ ఏరియా సబ్ యూనిట్ అధికారి శ్రీ సాయి, ఆయా కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

**నిజామాబాద్ జిల్లా జూలై 14(డీడీ9 వార్త):**

సమాజ మార్పు కోసం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పరితపించిన గొప్ప వ్యక్తి కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ అని సీపీఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథ, అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు కొనియాడారు. కమ్మర్‌పల్లి మండలం హసకొత్తూరు గ్రామంలో నిర్వహించిన ఆయన రెండో వర్ధంతి సభలో వారు పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షులు, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వి. సత్య మాట్లాడుతూ, చంద్రశేఖర్ కేవలం తన కోసం మాత్రమే కాకుండా, సమాజ శ్రేయస్సు కోసం జీవించిన మహనీయుడని గుర్తు చేశారు. ముఖ్యంగా పోడు భూముల సమస్య పరిష్కారం కోసం గిరిజన గ్రామాల్లో పర్యటిస్తూ, వారిని ఏకం చేసి భూ పోరాటాలను నడిపిన గొప్ప నాయకుడని కొనియాడారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని ఆయన చేసిన పోరాటాలు అజరామరమని పేర్కొన్నారు. ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన రైతాంగ పోరాటంలో సైతం చంద్రశేఖర్ క్రియాశీలకంగా పాల్గొన్నారని గుర్తు చేశారు. ఆయన చూపిన బాటలో నడుస్తూ, ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ది రాజేశ్వర్, లక్ష్మి, గౌరి, ఈ. నర్సు, ధనరాజ్, తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం (డి డి 9 వార్త ) జులై 14**

ప్రజలు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తలమడుగు పోలీసులు సూచించారు తలమడుగు ఎస్ఐ రాధిక ఆదేశాల మేరకు KHAKI KIDS అవగాహన సదస్సులో భాగంగా వారు గ్రామ గ్రామాన తిరుగుతూ ప్రజలకు పలు సూచనలు చేశారు గ్రామాలలో తప్పకుండా సిసి కెమెరాలు బిగించాలి ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం అని వారు అన్నారు ముఖ్యంగా యువత చెడు వ్యసనాల బారిన పడకుండా గంజాయి గుట్కా వంటి అలవాట్ల వల్ల. కలిగే నష్టాల గురించి వారు క్లుప్తంగా వివరించారు గ్రామాలలో ఎవరైనా అనుమానిత వ్యక్తులు సంచరిస్తే లేదా మేము బ్యాంకు నుండి ఫోన్ చేస్తున్నాము నేను మీ బ్యాంకు మేనేజర్ ని మీ అకౌంట్ బ్లాక్ అయింది మీరు ఓటీపీ చెబితే మీ అకౌంట్ తిరిగి పనిచేస్తుంది అని నమ్మ పలికితే మీరు స్పందించకూడదు మీకు ఏమైనా అనుమానం ఉంటే నేరుగా మీ బ్యాంకు మేనేజర్ వద్దకు వెళ్లి కలవండి అని వారు ప్రజలకు సూచించారు. ప్రజలందరూ చట్టాలకు అనుగుణంగా నడుచుకొని శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా సహకరించాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో. పోలీస్ సిబ్బంది ఎం కృష్ణ కాంత్. శ్రీనివాస్. గ్రామస్తులు అడిల్లు. సంతోష్ భూమన్న. రాందాస్ నారాయణ సురేష్ లు పాల్గొన్నారు




# బోథ్‌లో 'బాల అమృతం – తొలి ముద్ద'కు శ్రీకారం

- **అంగన్వాడీల ద్వారా చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం**

**ఆదిలాబాద్ జిల్లా బోథ్, జులై 14(డి డి 9):-**

చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించి ఆరోగ్యవంతమైన భావితరాన్ని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన "బాల అమృతం - తొలి ముద్ద" కార్యక్రమానికి బోథ్ మండల కేంద్రంలోని సాయినగర్ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం ఘనంగా శ్రీకారం చుట్టారు.*స్థానిక ఐసీడీఎస్ సీడీపీవో నర్సమ్మ, బోథ్ గ్రామ సర్పంచ్ కుర్మి అన్నపూర్ణ మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, ఏఎంసీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, బోథ్ మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ మెరుగు భోజన్న , కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కుర్మి మహేందర్, పాల్గొన్నారు. చిన్నారులకు ఉప్మాతో తొలి ముద్ద తినిపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.*ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు పోషకాహారం అత్యంత కీలకమని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార సేవలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లల శారీరక, మానసిక వికాసానికి అవసరమైన నాణ్యమైన ఆహారాన్ని అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించి ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ మోనికా, అంగన్వాడీ టీచర్లు లలిత, భూలక్ష్మి, శాకుంతల, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు నరసింహ దాస్ , బిట్లింగ్ గిరీష్, సన్నీ రెడ్డి, అబ్రార్ తదితరులు పాల్గొన్నారు.



# దాతల సేవాగుణం అభినందనీయం : ఎస్సై సతీష్

**నిజామాబాద్ జిల్లా జూలై 14(డీడీ9 వార్త):**

వేడుకల పేరుతో వృథా ఖర్చు చేయకుండా, విద్యార్థులకు అవసరమయ్యే విద్యా సామగ్రిని అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని కమ్మర్ పల్లి ఎస్సై సతీష్ అన్నారు. కమ్మర్ పల్లి మండలం కోనసముందర్ గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బట్టల మాధురినరేష్, బట్టల ప్రశాంత్ ఆధ్వర్యంలో రూ.12 వేల విలువైన నోటు పుస్తకాలు, పెన్నుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై సతీష్ మాట్లాడుతూ, నేటి యువత బట్టల మాధురినరేష్, ప్రశాంత్‌లను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. సమాజంలో ఇతరులకు ఉపయోగపడే పనులు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎస్సై మాట్లాడుతూ... విద్యార్థులు పాఠశాలకు వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇచ్చే వస్తువులను ఏమాత్రం తీసుకోవద్దని, సెల్ ఫోన్‌లకు దూరంగా ఉండి విద్యపైనే దృష్టి సారించాలని హితవు పలికారు. పిల్లల చదువు, అలవాట్ల విషయంలో తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ, శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరం దాతలు బట్టల మాధురినరేష్, ప్రశాంత్‌లను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్, గ్రామ సర్పంచ్ బెజ్జారపు రాకేష్‌లతో కలిసి ఎస్సై సన్మానించారు. అదే విధంగా ఎస్సై సతీష్‌ను పాఠశాల బృందం శాలువాతో ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో మధుపాల్, వార్డు సభ్యురాలు గడ్డం బుచ్చమ్మ, కరపే శేఖర్, గడ్డం మహేష్, పోతువంటి భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# త్వరితగతిన 'సర్' సర్వే పూర్తి చేయండి : సర్పంచ్ లావణ్య

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూలై 14(డీడీ9 వార్త):**

సాలూర తహసీల్దార్ కార్యాలయంలో చేపట్టిన 'సర్ ' నమోదు ప్రక్రియ వేగంగా సాగుతోంది. క్షేత్రస్థాయిలో సిబ్బంది పకడ్బందీగా సర్వే పనులు నిర్వహిస్తుండటంతో ఇప్పటివరకు 78 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమ తీరును సర్పంచ్ సోక్కం లావణ్య రవి స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఎన్యూమరేషన్ ఫారాలను ఎన్యూమరేటర్లకు వెంటనే అందజేయాలని, వాటిని నింపే ప్రక్రియలో ఎటువంటి జాప్యం చేయకుండా, వేగంగా పూర్తి చేసి సంబంధిత బీఎల్ఓలకు అప్పగించాలని స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులోగా వంద శాతం సర్వేను పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. సర్వేపై ప్రజలకు ఏవైనా సందేహాలుంటే, కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి, సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. పారదర్శకతతో కూడిన సర్వే కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ లావణ్య రవి పిలుపుని



# ములుగులో అద్వైత గ్రాండ్ హోటల్

- ఫైవ్ స్టార్ హోటల్ సౌకర్యాలు
- డబుల్ సింగిల్ రూములు, బంకువెట్ హాల్
- హైదరాబాద్ తరహాలో హోటల్లో ఏర్పాట్లు
- పర్యాటకులకు, జిల్లా ప్రజలకు సకల సౌకర్యం




**ములుగు, జూలై 14, డీ డీ 9వార్త**

ములుగు జిల్లా కేంద్రంలో సకల సౌకర్యాలతో ఫైవ్ స్టార్ హోటల్ కి తీసిపోని విధంగా అద్వైత గ్రాండ్ హోటల్ ప్రారంభానికి సిద్ధమైంది. స్థానిక బిఆర్ఎస్ నాయకులు వేముల బిక్షపతి జిల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నారు. నాలుగు అంతస్తుల భవనం నిర్మాణం, సింగిల్, డబల్ ఏసి రూములు, బంకువీట్ హాల్, హోటల్లోనే రుచికరమైన శుశికరమైన భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. ఈ హోటల్ నిర్మాణంలో పై అంతస్తులకు వెళ్లేందుకుగాను లిఫ్ట్ సైతం ఏర్పాటు చేశారు. హోటల్ నిర్మాణ పనులు పూర్తి కావడంతో ఈనెల 16న ప్రారంభం చేయనున్నట్లు వేముల బిక్షపతి తెలిపారు. హోటల్ లో 12 మంది అర్హత కలిగిన చెఫ్ ల ను, సిబ్బందిని నియమించారు.



# సివిల్ సప్లై హమాలీ కార్మికులకు లారీ మామూలు పెంచండి.

- ఏఐటీయూసీ డిస్ట్రిక్ జనరల్ సెక్రటరీ కడారి సునీల్ విజ్ఞప్తి.

**డిడి9వార్త / పెద్దపల్లి జులై 15:**



సివిల్ సప్లై హమాలీ కార్మికులకు గత కొన్ని సంవత్సరాల నుండి లారీ అన్‌లోడింగ్, లోడింగ్ లారీ మామూలు పెంచకుండా సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేస్తున్నాడని ఏఐటీయూసీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ అన్నారు ఈ రోజు సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కై సంబంధిత డీఎం గారితో చర్చించడం జరిగింది అని అన్నారు డిఎం గారు తన పరిధిలో ఉన్న సమస్యలు సత్వరమే పరిష్కారం దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు అదే విధంగా పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో సివిల్ సప్లై గోదాం నిర్మాణానికి స్థల సేకరణ కు సంబంధిత జిల్లా కలెక్టర్ గారు తాసిల్దారు గారు సహకరించాలని స్థలం కేటాయించి ప్రభుత్వ సొంత గోదాం నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలి వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం గట్టయ్య. ఉపాధ్యక్షులు ఏం కుమార్ కార్యదర్శి ఎం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.




# బోధన్ లో వాహనాల దొంగల అరెస్ట్

- ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూలై 14(డీడీ9 వార్త):**

బోధన్ మండల కేంద్రంలో వాహన చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ వివరాలను ఏసీపీ శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నిందితులు బోధన్‌లోని బీటీ నగర్‌కు చెందిన వసీం, ఆటో నగర్‌కు చెందిన జావీద్‌లుగా గుర్తించినట్లు తెలిపారు. వీరి నుంచి దొంగిలించిన ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించిన ఏఎస్ఐ బాబూరావు, కానిస్టేబుళ్లు గంగారాం, శివకృష్ణను అభినందించారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ వెంకట నారాయణ, ఎస్సై హబీబ్, సిబ్బంది ఉన్నారు.

# ఓటరు నమోదు ప్రక్రియకు సహకరించాలి : ఆర్డీవో

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూలై 14(డీడీ9 వార్త):**

కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియకు ప్రతి ఒక్కరూ సహకరించాలని బోధన్ ఆర్డీఓ విజయకుమారి కోరారు. మంగళవారం బోధన్ పట్టణంలోని ఎల్బీఎస్ నగర్‌లో గల కమ్యూనిటీ భవనంలో కొనసాగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ... అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. బిఎల్ఓలు నిర్ణీత గడువులోగా ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విఠల్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, వార్డ్ కౌన్సిలర్ దాము తదితరులు పాల్గొన్నారు.





# ప్రజా సమస్యలపై సర్పంచ్ ప్రత్యేక దృష్టి

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూలై 14(డీడీ9 వార్త):**

బోధన్ మండలంలోని పెంటఖుర్దూ గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. గ్రామ సర్పంచ్ వెంకటేష్ ఆధ్వర్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో ఎస్సీ కమ్యూనిటీ హాల్, వైకుంఠధామం వద్ద నూతన బోరుబావులను ఏర్పాటు చేశారు. ఈ పనుల వల్ల ఆయా ప్రాంతాల్లో నెలకొన్న నీటి కొరత తీరడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్న సర్పంచ్ వెంకటేష్, ఉపసర్పంచ్ వినోద్, కార్యదర్శి సుభాష్‌లను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వినోద్, పంచాయతీ కార్యదర్శి సుభాష్, గ్రామస్తులు గంగులు, జయరాం, పరశురాం, రాజు, కుర్మా లక్ష్మణ్, గంగారాం, జగన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పెంటఖుర్దూలో 97 శాతం ఓటరు సవరణ పూర్తి

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూలై 14(డీడీ9 వార్త):**

బోధన్ మండలంలోని పెంటఖుర్దూ గ్రామంలో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగంగా సాగుతోంది. మంగళవారం నాటికి 97 శాతం ప్రక్రియ పూర్తయినట్లు బీఎల్ఓ, అంగన్‌వాడీ టీచర్ సురేఖ, పంచాయతీ కార్యదర్శి సుభాష్ తెలిపారు. గ్రామస్థుల సహకారంతో సర్వే ప్రక్రియ సజావుగా సాగుతోందని మిగిలిన వారు కూడా తమ వివరాలను త్వరగా సమర్పించి, ఓటరు జాబితా తయారీలో భాగస్వాములు కావాలని వారు కోరారు. ఓటు హక్కు ప్రతి ఒక్కరికీ ఎంతో కీలకమని, ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి అధికారులకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వినోద్, ఆశా వర్కర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.





# జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించాలి

**నిజామాబాద్ జిల్లా జూలై 14(డీడీ9 వార్త):**

అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 100 శాతం ఉచిత విద్యను అందించాలని నిజామాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పంచారెడ్డి శ్రీకాంత్, వాగ్మారే సుభాష్ కోరారు. ఈ మేరకు మంగళవారం వారు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) అశోక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవలే జిల్లా పర్యటనకు వచ్చిన విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణకు కూడా ఈ విషయంపై విన్నవించగా, ఆమె సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకోవాలని డీఈవోను ఆదేశించినట్లు వారు వివరించారు.

సెలవుల అనంతరం విధుల్లో చేరిన డీఈవో అశోక్‌ను ప్రెస్ క్లబ్ కార్యవర్గం కలిసి మరోసారి పరిస్థితిని వివరించింది. జర్నలిస్టుల విన్నపంపై స్పందించిన డీఈవో అశోక్ సానుకూల హామీ ఇచ్చారు. ఒకటి రెండు రోజుల్లోనే జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందేలా చూస్తామని ఆయన తెలిపారు. ఇప్పటికే ఇతర జిల్లాల్లో అమలు చేస్తున్న ప్రొసీడింగ్స్‌ను పరిశీలించి, నిజామాబాద్ జిల్లాలో కూడా వెంటనే ఉత్తర్వులు జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. డీఈవో సానుకూల స్పందన పట్ల ప్రెస్ క్లబ్ కార్యవర్గం హర్షం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు సతీష్, కమిటీ సభ్యులు మరియు ఇతర జర్నలిస్టులు పాల్గొన్నారు.

# బీఎల్ఓల పనితీరు భేష్ : సర్పంచ్ జమున మహేష్

**నిజామాబాద్ జిల్లా జూలై 14(డీడీ9 వార్త):**

కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ గ్రామంలో చేపట్టిన బీఎల్ఓల ఎన్యుమరేషన్ ప్రక్రియను సర్పంచ్ జమున మహేష్ మంగళవారం పరిశీలించారు. గ్రామంలో ఇప్పటివరకు 97 శాతం ప్రక్రియను పూర్తి చేసినందుకు బీఎల్ఓల పనితీరును ఆమె ప్రశంసించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ...ఎన్యుమరేషన్ ప్రక్రియలో ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, నిర్ణీత లక్ష్యం దిశగా పనులు పూర్తి చేస్తున్న బీఎల్ఓల కృషి అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీఎల్ఓలు దినేష్ యాదవ్, శ్రీధర్, శ్యామ్, సత్యానంద్, మహిళా సంఘాల సీఏలు రజిత, రుచిత, భాగ్యలక్ష్మి, కృష్ణవేణి, వివిధ పార్టీల బీఎల్ఏలు బందెలా రాజు, నర్రా మోహన్, డాక్టర్ మురళి, సుమన్, నరేష్, అలాగే ఆరోగ్యశాఖకు చెందిన ఆశా కార్యకర్తలను సర్పంచ్ జమున మహేష్ ప్రత్యేకంగా అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ భూమేశ్వర్, కార్యదర్శి నవీన్ గౌడ్, వార్డు సభ్యులు శేఖర్, శ్రీనివాస్, రమేష్, రాకేష్, రవి, పురుషోత్తం, లావణ్య, విశాల్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా స్థాయి పరుగు పందెంలో విజయ సాయి విద్యార్థుల ప్రతిభ

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూలై 14(డీడీ9 వార్త):**

జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో శ్రీ విజయ సాయి ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. జూలై 7న నిజామాబాద్‌లోని నాగారం స్టేడియంలో 12 ఏళ్ల లోపు బాలబాలికలకు నిర్వహించిన 300 మీటర్ల పరుగు పందెంలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పోటీల్లో ఏడవ తరగతి చదువుతున్న టి.అనన్య ద్వితీయ స్థానాన్ని, ఆరవ తరగతి చదువుతున్న టి. మోక్ష తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.కృష్ణమోహన్ మాట్లాడుతూ... విద్యార్థులు కృషి, పట్టుదలతో సాధించిన ఈ విజయం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో వీరు మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విజేతలను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.








## తెలంగాణ బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలి.

- **12వ వేజ్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలి.**
- **తాడిచర్ల బ్లాక్-2 ను సింగరేణికి కేటాయించినందుకు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి కి నాయకుల కృతజ్ఞతలు.**

**డిడి9వార్త / రామగుండం జులై 15:**

సింగరేణి లో "భరోసా యాత్ర" పేరుతో మంగళవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియా ఓసిపి5 కి విచ్చేసిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి కి సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటియుసి నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ వినతి పత్రం లో తెలంగాణలో ఉన్న బొగ్గు గను లను వేలం పాట లేకుండా సింగరేణి సంస్థకే కేటాయించాలని,12వ వేజ్ బోర్డు ఒప్పంద ప్రక్రియను ప్రారంభించేందుకు తక్షణమే వేతన కమిటీని ఏర్పాటు చేయాలని, నాలుగు లేబర్ కోడ్ లతో సంబంధం లేకుండా గతంలో వలె 12వ వేజ్ బోర్డు వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేయడం జరిగిందని నాయకులు పేర్కొన్నారు. అదేవిధంగా సింగరేణికి తాడిచర్ల బ్లాక్ 2 ను కేటాయించినందుకు కేంద్ర మంత్రి కి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. వినతి పత్రం అందజేసి , కేంద్ర మంత్రి కి డిమాండ్ లను వెల్లడించిన వారిలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శిమడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కామ్రేడ్ కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను లు ఉన్నారు, ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్జీ 1, బ్రాంచి నాయకులు మాదన మహేష్, బోగ సతీష్ బాబు, ఎస్. వెంకట్ రెడ్డి, గండి ప్రసాద్, మానాల శ్రీనివాస్, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, చంద తిరుపతి.తదితరులు పాల్గొన్నారు.

## సివిల్ సప్లై హమాలీ కార్మికులకు లారీ మామూలు పెంచండి.

- **ఏఐటీయూసీ డిస్ట్రిక్ జనరల్ సెక్రటరీ కడారి సునీల్ విజ్ఞప్తి.**

**డిడి9వార్త / పెద్దపల్లి జులై 15:**

సివిల్ సప్లై హమాలీ కార్మికులకు గత కొన్ని సంవత్సరాల నుండి లారీ అన్‌లోడింగ్, లోడింగ్ లారీ మామూలు పెంచకుండా సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేస్తున్నాడని ఏఐటీయూసీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ అన్నారు ఈ రోజు సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కై సంబంధిత డీఎం గారితో చర్చించడం జరిగింది అని అన్నారు డిఎం గారు తన పరిధిలో ఉన్న సమస్యలు సత్వరమే పరిష్కారం దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు అదే విధంగా పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో సివిల్ సప్లై గోదాం నిర్మాణానికి స్థల సేకరణ కు సంబంధిత జిల్లా కలెక్టర్ గారు తాసిల్దారు గారు సహకరించాలని స్థలం కేటాయించి ప్రభుత్వ సొంత గోదాం నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలి వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం గట్టయ్య. ఉపాధ్యక్షులు ఏం కుమార్ కార్యదర్శి ఎం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వ కుట్ర..

- **గోదావరిఖనిలో ఏబీవీపీ కళాశాలల బంద్ విజయవంతం**
- **రూ.11 వేల కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్**
- **విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శ**
- **సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం హెచ్చరిక**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 14 (డీడీ9 వార్త):**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గోదావరిఖనిలో కళాశాలల బంద్ విజయవంతంగా నిర్వహించారు. బంద్‌కు పలు కళాశాలల విద్యార్థులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్‌డీ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ గొట్టె ఉదయ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి చదువుకుంటున్నారని, ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడంతో రూ.11 వేల కోట్ల పెండింగ్ ఏర్పడిందని ఆరోపించారు. దీంతో వేలాది మంది విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని, సర్టిఫికెట్లు కూడా పొందలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలు విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర సంయుక్త కార్యదర్శి రుషిక్‌తో పాటు జీవన్, సాయి తేజ, సాయి నిఖిల్, సైనాథ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.




# రాజకీయ లబ్ధి కోసమే కరువును కాళేశ్వరంతో ముడి పెడుతున్న బీఆర్ఎస్.

- **ఎన్డిఎస్ఏ ఆదేశాల మేరకే కన్నేపల్లి పంప్ హౌస్ వద్ద నుండి నీటిని ఎత్తిపోయడం లేదు.**
- **అడుగు బొడుగు వసూళ్ల కోసమే మరో 3 నెలలు మంత్రి పదవిని కోరుతున్న హరీష్ రావు.**
- **హరీష్ రావు మంత్రిగా ఉన్న హయాంలోనే కాళేశ్వరం నిర్మాణం కుంగిపోవడం జరిగింది.**
- **మూడు బ్యారేజీలను నిర్మించి గ్యారేజీలుగా మార్చిన చరిత్ర హరీష్ రావుది.**
- **బుర్ర లేనిది సీఎంకు కాదు, కేటీఆర్ కే.**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఆయన వరుస వైఫల్యాలే ఇందుకు నిదర్శనం.**
- **ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.**

**డిడి9వార్త / పెద్దపల్లి జులై 15:**

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఆర్ & బీ గెస్ట్ హౌస్ లో మంగళవారం రోజున ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణ రావు మీడియా సమావేశం నిర్వహించారు.మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్ విజయరమణ రావు మాట్లాడుతూ..కేటీఆర్ కరీంనగర్ పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రిపై, కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ బురద చల్లడమే పనిగా పెట్టుకున్నాడని విమర్శించారు. ముఖ్యమంత్రి కి బుర్రలేదని కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, అసలు బుర్ర లేనిది కేటీఆర్ కే అని అన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా అతని వరుస వైఫల్యాలే ఇందుకు నిదర్శనమన్నారు. నాడు కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల కాసుల వర్షం కురిపించుకున్న బీఆర్ఎస్... నేడు అదే ప్రాజెక్టును కరువుతో ముడు పెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని అన్నారు. మాజీ మంత్రి హరీష్ రావు కాళేశ్వరం ప్రాజెక్టును బాగు చేసేందుకు మూడు మాసాల కాలం మంత్రి పదవి కావాలని కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అతని హయాంలోనే కాళేశ్వర ప్రాజెక్టు నిర్మాణం మరియు కట్టిన నిర్మాణం కుంగిపోవడం జరిగిందన్నారు. ఇది విస్మరించి మరో సారి మంత్రి పదవి కావాలని అడగడం అడుగు..బొడుగుగా ఉన్న పెండింగ్ వసూళ్ల కోసమే అని అర్థమవుతోందని విజయరమణ రావు ఎద్దేవా చేశారు. తుమ్మడి హెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం చేస్తే ఎంతో ప్రయోజనంగా ఉండేదని, పంతాలకు, పట్టుదలకు, అక్రమార్జనకు పోయి గోదావరి నది మీద ప్రాజెక్టు నిర్మించారని అన్నారు. నిర్మించిన మూడేళ్లకే మూడు బ్యారేజీలు ఎందుకు గ్యారేజీలుగా మారాయో బీఆర్ఎస్ సమాధానం చెప్పడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు, ఎల్ ఎం డి ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సుమారు 6 లక్షల ఎకరాలకు రెండు పంటలకు నీరు అందిస్తోందని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి దూర దృష్టితో అప్పట్లో నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ఎప్పటికీ లైఫ్ లైన్ గా ఉంటుందన్నారు. బీఆర్ఎస్ హయంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నిర్మించిన మూడు బ్యారేజీలు ఎందుకు కూలిపోయాయి ఇప్పటికైనా సమాధానం చెప్పాలని విజయరమణ రావు డిమాండ్ చేశారు. కన్నెపల్లి పంపు హౌస్ నుండి మోటార్లను ఆన్ చేసి నీటిని ఎత్తిపోయడం వల్ల పెను ప్రమాదం పొంచి ఉందని అధికారిక ఇంజనీరింగ్ నిపుణులు పేర్కొనడం వల్లే ప్రభుత్వం తగిన విధంగా నడుచుకుంటూ ఉందని అన్నారు. రైతు సంక్షేమాన్ని పట్టించుకోని బీఆర్ఎస్ ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుపెట్టుకొని మొసలి కన్నీళ్లు కారుస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ఏది ఏమైనా ఎన్ డి ఎస్ ఏ తదుపరి నివేదికల ప్రకారమే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ మార్కెట్ చైర్మన్ ఆకుల నర్సయ్య, కార్పొరేటర్లు పడాల అజయ్ గౌడ్ చెల్లోజ రాజు, అజయ్ రెడ్డి,మరియు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల గుండెల్లో స్థానం సంపాదిస్తూ_ _ _ సేవతో ముందుకు సాగుతున్న భూక్య జంపన్న30వ విడత మెగా ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం

- **44 మందికి శస్త్రచికిత్సల కోసం ఎంపిక**

**ములుగు, జూలై 14, డీ డీ 9 వార్త :**

ప్రజాసేవనే పరమావధిగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్య జంపన్న ఆధ్వర్యంలో వెంకటాపురం మండల కేంద్రంలో నిర్వహించిన 30వ విడత మెగా ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. శిబిరంలో కంటి సమస్యలతో బాధపడుతున్న పేదలు, వృద్ధులకు నిపుణులైన వైద్యులచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహించగా, శస్త్రచికిత్స అవసరమైన 44 మందిని గుర్తించి, హైదరాబాద్‌లోని శంకర కంటి ఆసుపత్రికి ప్రత్యేక బస్సు ద్వారా తరలించారు.

గత రెండున్నర సంవత్సరాలుగా ములుగు జిల్లాలోని గ్రామాల వారీగా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ వేలాది మంది నిరుపేదలకు చూపును అందించే సేవా కార్యక్రమాలను భూక్య జంపన్న నిరంతరంగా కొనసాగిస్తున్నారు. ఆయన చేపడుతున్న ఈ సేవా కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది.

ఈ సందర్భంగా భూక్య జంపన్న మాట్లాడుతూ, "పేద ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాను. నేను చేస్తున్న సేవను చూసి కొందరు తప్పుడు ప్రచారం చేసినా వాటిని ఏమాత్రం పట్టించుకోను. ప్రజలే నాకు బలం, వారి ఆశీస్సులే నా ఆస్తి. ప్రజల ఆశీర్వాదం ఉన్నంత వరకు సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తాను" అని అన్నారు.

అలాగే త్వరలో ములుగు జిల్లాలోని ప్రతి గ్రామానికి, ప్రతి గడపకు వెళ్లి ప్రజల ఆశీర్వాదం కోరనున్నట్లు తెలిపారు. "మీ ఇంటికి మీ ఆశీర్వాదం కోసం వస్తాను. మీ ప్రేమ, మీ ఆశీస్సులు ఎల్లప్పుడూ నాకు ఉండాలి" అని ఆయన పేర్కొన్నారు.

శిబిరం ద్వారా లబ్ధి పొందిన వృద్ధులు, పేద కుటుంబాలు మాట్లాడుతూ, కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న తమకు భూక్య జంపన్న ఇంటి పెద్ద కొడుకులా అండగా నిలిచారని తెలిపారు. తమ జీవితాల్లో మళ్లీ వెలుగులు నింపిన ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో ప్రజాసేవను మరింత విస్తృతంగా కొనసాగించాలని ఆశీర్వదించారు. ప్రజాసేవనే రాజకీయానికి పునాదిగా చేసుకుని ప్రజల్లో విశ్వాసాన్ని సంపాదించుకున్న భూక్య జంపన్న సేవలు ములుగు జిల్లాలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నాయని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ వెంకటాపూర్ మాజీ మండల అధ్యక్షులు లింగాల రమణా రెడ్డి, మాజీ సర్పంచ్ సాదా యాదగిరి గారు, చంటి భద్రయ్య గారు, బాదావత్ రాజ్ కుమార్ గారు, పోషల్ల వీరమల్లు గారు, నల్ల భద్రయ్య గారు, నరెట్ల విజయేందర్ గారు, నూనె రమేష్ గారు, సోమిడి రవి గారు, చిక్కుల కళ్యాణి గారు, జహీర్ పాషా గారు, చిగురు దేవేందర్ గారు, తోట సంపత్ గారు, తదితరులు పాల్గొన్నారు..







# 48 ఏళ్లుగా న్యాయం కోసం పోరాటం.

- **కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి పుట్ట రాజన్న వినతి.**

**డిడి9వార్త / రామగుండం జులై 15:**

పోలీస్ కాల్పుల్లో మృతి చెందిన సింగరేణి కార్మికుడు పుట్ట నారాయణ కుటుంబానికి ఉద్యోగం, భూమి, నష్టపరిహారం కల్పించాలని విజ్ఞప్తి 1978లో గోదావరిఖనిలో జరిగిన పోలీస్ కాల్పుల్లో మృతి చెందిన సింగరేణి కార్మికుడు పుట్ట నారాయణ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఆయన తమ్ముడు పుట్ట రాజన్న మంగళవారం ఆర్ జీవన్ ఓసి ఫైవ్ కి వచ్చిన సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. నాలుగు దశాబ్దాలకు పైగా గడిచినా తమ కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం గోదావరిఖనికి సమీపంలో ముస్త్యాల గ్రామానికి చెందిన పుట్ట నారాయణ సింగరేణి జీడీకే6 ఇంక్లైన్ గనిలో కోల్ ఫిల్లర్‌గా పనిచేసేవారు. 1978 ఏప్రిల్ 5న విధులు ముగించుకుని గోదావరిఖని ప్రధాన చౌరస్తా సమీపంలోని సింగరేణి సూపర్ బజార్ వద్దకు వెళ్లిన సమయంలో, రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న నిరసనల నేపథ్యంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆయన మృతి చెందినట్లు వివరించారు.

హైదరాబాద్‌లో జరిగిన రమీజాబీ ఘటనకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా బంద్‌లు, ఆందోళనలు జరుగుతున్న క్రమంలో గోదావరిఖనిలో చోటు చేసుకున్న పోలీస్ కాల్పుల్లో తన అన్న ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో తమ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టబడిందని పేర్కొన్నారు.ఆనాటి ప్రభుత్వం తమ కుటుంబానికి నష్టపరిహారం, సింగరేణిలో ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, 48 ఏళ్లు గడిచినా ఎలాంటి న్యాయం జరగలేదని రాజన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, సింగరేణి అధికారులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకపోయిందని తెలిపారు.తమ కుటుంబంలోని ఒకరికి సింగరేణి లేదా ప్రభుత్వ ఉద్యోగం కల్పించడంతో పాటు, ఐదు ఎకరాల వ్యవసాయ భూమి, తగిన నష్టపరిహారం, ఇతర ప్రభుత్వ సౌకర్యాలు అందించాలని కేంద్ర మంత్రిని కోరారు. అలాగే ముస్త్యాల గ్రామంలోని కొత్తరోడ్ మూలమలుపు వద్ద ముస్త్యాల కమాన్ బోర్డు సమీపంలో అమరుడు. పుట్ట నారాయణ విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు దిమ్మెను నిర్మిస్తే కాంగ్రెస్ నాయకులు మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలతో సింగరేణి అధికారులు కూల్చివేశారని..తిరిగి పునర్నిర్మాణం చేసేలా సింగరేణి ఆర్‌జీ 1 జనరల్ మేనేజర్‌కు ఆదేశాలు ఇవ్వాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. ఈ అంశానికి సంబంధించిన పలు ఆధారాలు,గతంలో ప్రభుత్వానికి సమర్పించిన వినతి పత్రాల ప్రతులను కూడా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి జతచేసినట్లు పుట్ట రాజన్న తెలిపారు.అదే ప్రాంతంలో ఇటీవల శ్రీ పదరావు విగ్రహాన్ని పెట్టారని ఆ ప్రాంతాన వేరే వారి విగ్రహం ఉండకూడదని కక్షతో దురుద్దేశంతో కూల్చివేశారని. గతంలో పోలీసులు సింగరేణి అధికారులు భయభ్రాంతులకు గురి చేశారని అది ఇప్పటికీ కొనసాగుతున్నదని ఆవేదన వ్యక్తపరిచారు.తమ



# మణుగూరు సింగరేణి ప్రాంతానికి రైలు సేవల పునరుద్ధరణ, పొడిగింపులకు చొరవ చూపాలి..

- కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డికి ఏరియా టి బి జి కె యస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వేంకటేశ్వర్లు వినతి పత్రం అందచేత.

**మణుగూరు.జూలై 14(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఏజెన్సీ ప్రాంతమైన మణుగూరు సింగరేణి ఏరియాలో కోవిడ్ సమయంలో నిలిపివేసిన రైలు సేవలను పునరుద్ధరించడంతో పాటు పలు రైళ్లను మణుగూరు వరకు పొడిగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి మణుగూరు ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు వినతిపత్రం అందజేశారు. మంత్రి మణుగూరు ఏరియా పర్యటన సందర్భంగా ఆయనను స్వయంగా కలిసి ఈ వినతిపత్రాన్ని సమర్పించారు.

వినతిపత్రంలో మణుగూరు సింగరేణి ఏరియా మారుమూల ఏజెన్సీ ప్రాంతమైనప్పటికీ, ప్రకృతి ప్రసాదించిన అపార బొగ్గు నిల్వలతో తెలంగాణ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కీలకంగా నిలుస్తోందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పిస్తూ ఈ ప్రాంత ప్రజలకు వెన్నెముకగా నిలిచిందని తెలిపారు. అంతేకాకుండా దక్షిణ మధ్య రైల్వేకు బొగ్గు రవాణా ద్వారా గణనీయమైన ఆదాయం సమకూరుస్తున్నప్పటికీ, కోవిడ్ కాలంలో నిలిపివేసిన రైలు సేవలను ఇప్పటివరకు పునరుద్ధరించకపోవడంతో కార్మికులు, విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రజలు దూర ప్రాంతాలకు ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.

ఈ నేపథ్యంలో రైలు నెం. 57657/57658 మణుగూరు-కాజీపేట ప్యాసింజర్, రైలు నెం. 11303/11304 మణుగూరు-కోల్హాపూర్ ఎక్స్‌ప్రెస్, రైలు నెం. 07335/07336 మణుగూరు-బెల్గాం ఎక్స్‌ప్రెస్ సేవలను పునరుద్ధరించాలని కోరారు. అలాగే రైలు నెం. 17033/17034 సింగరేణి మెమును భద్రాచలం రోడ్ నుండి మణుగూరు వరకు పొడిగించాలని, రైలు నెం. 17659/17660 కాకతీయ ఎక్స్‌ప్రెస్ను మణుగూరు వరకు పొడిగించి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌గా నడపాలని విజ్ఞప్తి చేశారు .ఈ రైలు సేవల పునరుద్ధరణ, పొడిగింపుతో మణుగూరు ప్రాంత ప్రజలకు మెరుగైన రైలు కనెక్టివిటీ ఏర్పడి, ప్రాంతీయ అభివృద్ధికి ఊతమివ్వడంతో పాటు వేలాది మంది ప్రయాణికులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ అంశాన్ని దక్షిణ మధ్య రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి, మణుగూరు ప్రాంతానికి రైలు సేవలను పునరుద్ధరించి మరింత మెరుగుపరిచేందుకు చొరవ చూపాలని కేంద్ర మంత్రిని కోరారు.ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు బంగారి పవన్ కుమార్, బొద్దుల ప్రవీణ్ కుమార్, జంగం రాజ్ కుమార్, సాంబార్ రాజశేఖర్, గుగులోత్ రమేష్ నాయక్, పద్దం శ్రీనివాస్, భాను కృష్ణ, వేముల నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నాయకుడు కేసీఆర్

- బిఆర్ఎస్ మల్లంపల్లి మండలయూత్అధ్యక్షుడు మొర్రిరాజుయాదవ్

**డీ డీ 9 వార్త, ములుగు**

రైతుల పొలాలు పండడం కోసం కెసిఆర్ కేటీఆర్ హరీష్‌రావుల రక్తమే కాదు బిఆర్ఎస్ పార్టీ ప్రతి ఒక్క కార్యకర్తమరియు రైతులుకూడారక్తంఇవ్వడానికి సిద్ధమే అని మొర్రిరాజుయాదవ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు తెలంగాణ రైతులపంటలకు నీళ్లివ్వండి, మీనాయకుడు చంద్రబాబు కోసం తెలంగాణ రైతులను బలిపెట్టవద్దు అని అడిగితే సమాధానం చెప్పలేక బిఆర్ఎస్ పార్టీ నాయకులైన కెసిఆర్, కేటీఆర్ ,హరీష్ రావు లాంటి నాయకులను కోసి పంటలపై రక్తం చల్లి పంటలు పండిస్తామనడం.ఇది చాలా దుర్మార్గమైన విధానం. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. తెలంగాణ రాష్ట్రం కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా స్వరాష్ట్ర స్వప్నమే ధ్యేయంగా అహర్నిశలు పరితపించిన మహా నాయకుడు కేసీఆర్. అలాంటి నాయకులను అవహేళనగా మాట్లాడం చాలా బాధాకరం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినాక రైతుని రాజుగా చేయాలనే ధృడ సంకల్పంతో రైతులకు 24 గంటల ఉచిత కరెంటు, రైతు బంధు, రైతు భీమా లాంటి ఎన్నో పథకాలు పెట్టి వ్యవసాయం దండుగా అన్న నోటితోనే వ్యవసాయం పండుగ అనే విధంగా చేసిన మహనీయుడు కేసీఆర్. ఇవ్వాలా నేను రైతులకు పెట్టుబడి సాయం చేస్తున్న అని గొప్పాలు కొట్టుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు రైతులగూర్చి అలాంటి ఆలోచన చేసిందే కెసిఆర్ అనే విషయాన్ని గుర్తు చేసుకుంటే బాగుంటుంది. తెలంగాణ రాష్ట్ర కోసం ఎంతో మంది బిఆర్ఎస్ శ్రేణులు నెత్తురు ధారపోసి రాష్ట్రాన్ని సాధించడం జరిగింది. అలాంటి రాష్ట్రంలో ఈరోజు ముఖ్యమంత్రి గారు బిఆర్ఎస్ నాయకుల రక్తం ఇస్తే రైతులకు నీళ్లు ఇస్తామంటే రైతుల ప్రయోజనాల కోసం బిఆర్ఎస్ నాయకులు రక్తం ఇవ్వడానికి కూడా సిద్ధమే. ప్రాజెక్ట్ గురించి సలహాలు, సూచనలు చేస్తున్న రిటైర్డ్ ఇంజనీర్ల మాటలు కూడా వినకుండా పేడాచెవిన పెట్టే విధానాన్నితెలంగాణ సమాజం గమనిస్తున్నది. రానున్న రోజుల్లో రైతులే ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెపుతారని అన్నారు. ఎక్కడ నీళ్లిస్తే వాళ్లు కాలేశ్వరం పైచేసిన ఆరోపణలు అబద్ధాలు అని తెలంగాణ ప్రజలు గ్రహిస్తారనే ఉద్దేశంతో బిఆర్ఎస్ పార్టీని కెసిఆర్ గారిని అభాసుపాలు చేయడానికి చేసే ప్రయత్నంలో భాగమే ఈరోజు రైతులకు నీళ్లు ఇవ్వడం లేదు రాజకీయాలతోరైతులను బలిచేయవద్దని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని కోరుతున్నామని మొర్రి రాజుయాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ ఎండి పాషా ఎస్సీ సెల్ నాయకుడు కట్ల గణపతి యువజన విభాగం నాయకుడు కుక్కల సంపత్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం.. కృష్ణవేణి స్కూల్‌పై చర్యలు తీసుకోండి!

- స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం వీడాలి.. లేదంటే ఆందోళన తప్పదు!
- స్కూల్ ఎదుట ఏఐఎస్ఎఫ్ నిరసన
- కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలి, అర్హత కలిగిన ఉపాధ్యాయులను నియమించాలి
- స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిక

**పెద్దపల్లి బ్యూరో, జూలై 14 (డీడీ9 వార్త):**

మార్కండేయ కాలనీలోని కృష్ణవేణి స్కూల్‌లో విద్యార్థులకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించి, సంబంధిత లోపాలపై విద్యాశాఖ అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ నాయకులు పాఠశాల ఎదుట నిరసన చేపట్టారు.

ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ..., విద్యార్థులను ఆకర్షించేందుకు ప్రచారానికి ప్రాధాన్యం ఇస్తూ, మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులకు తగిన మూత్రశాలలు, మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని, అర్హత కలిగిన ఉపాధ్యాయులతోనే బోధన నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుండ్ల లక్ష్మీప్రసన్నతో పాటు పలువురు విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.




# 1ఆఫ్70 ఎల్టిఆర్ చట్టాలకు తూట్లు పొడుస్తూతూ

- ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ ఉద్యోగి అక్రమ ఇంటి నిర్మాణం
- తక్షణమే చర్యలు తీసుకోవాలని
- మన్య సీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ మంగపేట మండల అధ్యక్షుడు తాటి నాగరాజు డిమాండ్ చేశారు

**మంగపేట జూలై 14డీడీ 9 వార్త**

ములుగు జిల్లా షెడ్యూల్ ఏరియా మంగపేట మండలంలోని తాహసిల్దార్ కార్యాలయం పక్కన కస్తూర్బా హాస్టల్ పక్కన ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 20 ఈధులకుంట చెరువు శిఖములో గిరిజనేతరుడైన ఎండి మున్వర్ ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమంగా ఇంటి నిర్మాణం చేస్తున్నారు ఇట్టి అక్రమ ఇంటి నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని మంగపేట తహశీల్దార్ తోట రవీందర్ ను కలిసి మెమొరండం ఇచ్చిన మన్య సీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ మంగపేట మండల అధ్యక్షుడు తాటి నాగరాజు మాట్లాడుతూ ఎండి మున్వర్ ప్రభుత్వ ఉద్యోగి ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేస్తున్నడు పలుమార్లు చెప్పిన గిరిజనులను గిరిజన చట్టాలను వేలన చేస్తూ గిరిజన చట్టాలకు విరుద్ధంగా ఇంటి నిర్మాణం చేస్తున్నారు ఇతనిపై చర్యలు తీసుకోని క్రిమినల్ కేసులు పెట్టాలని మంగపేట తాహసిల్దార్ ను కొరడం జరిగింది ఈ కార్యక్రమంలో మన్యసీమ జిల్లా నాయకులు తోలేం సుధాకర్, ఆక తిరుమలరావు, జబ్బ నరేష్, దొడ్డ విష్ణుమూర్తి, ఈసాల భాగ్యరాజ్, ఎట్టి రవి తదితరులు పాల్గొన్నారు



# పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి: ఎన్ఎఫ్ఐడబ్ల్యూ

- చలో సెక్రటేరియట్‌కు వెళ్లిన ఏఐఎస్ఎఫ్ నాయకుల అరెస్టులను ఖండించిన ఎన్ఎఫ్ఐడబ్ల్యూ
- విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడొద్దని హెచ్చరిక
- సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం



**పెద్దపల్లి బ్యూరో, జూలై 14 (డీడీ9 వార్త):**

రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ జిల్లా ఉపాధ్యక్షురాలు శనిగరపు తిరుమల, జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల రమాదేవి డిమాండ్ చేశారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ ఇచ్చిన "చలో సెక్రటేరియట్" పిలుపు నేపథ్యంలో నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ విద్యార్థుల గొంతు నొక్కే చర్యలను ప్రభుత్వం విరమించుకోవాలని, అరెస్టు చేసిన ఏఐఎస్ఎఫ్ నాయకులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే విద్యార్థుల సమస్యలపై స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో విద్యార్థి, మహిళా సంఘాలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నాయకులు హెచ్చరించారు.

# ఆటో, మోటార్ కార్మికులను ఐక్యం చేసి, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలి.

- తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్(TUCI) రాష్ట్ర కార్యదర్శి పాయం. వెంకన్న.

**మణుగూరు.జూలై 14(డి డి 9వార్త)**

భద్రాద్రి జిల్లా, మణుగూరు. ఆటో, మోటార్ కార్మికుల ఐక్యం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్(TUCI) రాష్ట్ర కార్యదర్శి పాయం. వెంకన్న కార్మికులకు పిలుపునిచ్చారు, టి యు సి ఐ జిల్లా అధ్యక్షులు ఆర్. మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన డివి ఫంక్షన్ హాల్ లో జరిగిన మణుగూరు ఏరియా ట్రాక్టర్ డ్రైవర్ల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నేడు రాష్ట్రంలో లక్షలాదిమంది ఆటో మోటార్ కార్మికులు స్వయం ఉపాధితో జీవిస్తున్నారని,వీరికి ఎటువంటి ప్రభుత్వ సహాయం అందడం లేదని, పైగా పన్నుల రూపంలో ప్రభుత్వానికి వందల కోట్ల రూపాయలు చెల్లిస్తున్నారని అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం 2019 మోటార్ రవాణా (సవరణ) చట్టం తెచ్చి రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లే కారణమని జరిమానాల రూపంలో వందల కోట్ల రూపాయలు వసూలు చేస్తున్నారని,జరిమానాలతో పాటు జైలు శిక్షలు కూడా విధిస్తున్నారని,డ్రైవర్లను ఖూనీ కోర్లుగా మార్చి జైల్లో నిర్బంధించేవిధంగా చట్టాన్ని రూపొందించారని విమర్శించారు. మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని,2019 మోటార్ రవాణా (సవరణ) చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మణుగూరు ఏరియా ట్రాక్టర్ డ్రైవర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా: కొరసా.సమ్మయ్య , ఉపాధ్యక్షులుగా: మడకం.లక్ష్మయ్య, గట్టుపల్లి.రమేష్. కార్యదర్శిగా:కోంద్రు.శ్రీను, సహాయ కార్యదర్శులుగా: సవలం.లక్ష్మయ్య, కొక్కిరేణి.మహేష్. కోశాధికారిగా: కనితి. భూపతి, కమిటీ సభ్యులుగా: గట్టు భద్రయ్య, నూక.సంపత్ కారం. కిశోర్,ఇర్పా.ప్రసాద్, బి.శంకర్, కారం.శంకర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో టి యు సి ఐ మణుగూరు ఏరియా సహాయ కార్యదర్శి పి. సంజీవరెడ్డి, నాయకులు వంశీ, మరియు ట్రాక్టర్ డ్రైవర్లు పాల్గొన్నారు.



# మిత్రుడి స్మారకార్థం విద్యార్థులకు ఉచిత బ్యాగుల పంపిణీ

- రాంనగర్ ప్రభుత్వ పాఠశాలలో 40 బ్యాగుల పంపిణీ
- జక్కుల సతీష్ జ్ఞాపకార్థం క్లాస్‌మేట్స్ సేవా కార్యక్రమం
- అభినందించిన సర్పంచ్ పల్లె ప్రతిమ పివీరావు

**పెద్దపల్లి బ్యూరో, జూలై 14 (డీడీ9 వార్త):**

రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ పరిధిలోని రాంనగర్ ప్రభుత్వ పాఠశాలలో జక్కుల సతీష్ స్మారకార్థం విద్యార్థులకు ఉచితంగా 40 స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. గత ఏడాది అనారోగ్యంతో మృతి చెందిన సతీష్ జ్ఞాపకార్థం ఆయన 2010 బ్యాచ్ క్లాస్‌మేట్స్ విరాళాలు సేకరించి రూ.12 వేల విలువైన బ్యాగులను కొనుగోలు చేసి విద్యార్థులకు అందించారు.

స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమపి వీరావు చేతుల మీదుగా బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మంచి మిత్రుడి స్మారకార్థం విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ మారేపల్లి ఈశ్వరి, ఉపాధ్యాయులు, సతీష్ కుటుంబ సభ్యులు, క్లాస్‌మేట్స్ పాల్గొన్నారు.




# కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యం: కోరుకంటి చందర్

- కేటీఆర్‌ను కుటుంబ సమేతంగా కలిసిన మాజీ ఎమ్మెల్యే
- తిరుమల, కామాఖ్య ఆలయ ప్రసాదాలను అందజేత
- కేసీఆర్ పాలనే తెలంగాణకు శ్రీరామరక్ష అని వ్యాఖ్య

**పెద్దపల్లి బ్యూరో, జూలై 14 (డీడీ9 వార్త):**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయడమే తమ లక్ష్యమని, కేసీఆర్ పాలనే తెలంగాణకు శ్రీరామరక్ష అని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కుటుంబ సమేతంగా కలిసి, కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని తిరుమల తిరుపతి దేవస్థానం, కామాఖ్య అమ్మవారి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్, కోరుకంటి చందర్ కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకుని ఆప్యాయంగా మాట్లాడారు.





# కరువులో వరంగా నూతన బోర్‌వెల్స్ ..

- **ముత్తారం, సూరవీడు కాలనీలకు తాగునీటి భరోసా..**

**జూలై14 డిడి 9 వార్త వెంకటాపురం.**

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలనే సంకల్పంతో బాలవికాస్ సంస్థ మరియు కాఫేడు సంస్థ సంయుక్త సహకారంతో వెంకటాపురం మండలంలోని ముత్తారం గ్రామం మరియు సూరవీడు కాలనీలో నూతన బోర్‌వెల్స్‌ను ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ముత్తారం గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శి, సూరవీడు కాలనీ సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామ కార్యదర్శి, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బాలవికాస్ సంస్థ ప్రతినిధి శ్రీ ప్రశాంత్, కాఫేడు సంస్థ డైరెక్టర్ బ్రదర్ కె. లూర్దు రాజు ముఖ్య అతిథులుగా హాజరై బోర్‌వెల్స్‌ను ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కరువు పరిస్థితుల్లో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ బోర్‌వెల్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామస్థులు ఈ నీటి వనరులను తమ సొంత ఆస్తిగా భావించి, జాగ్రత్తగా వినియోగించుకోవడంతో పాటు భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడేలా సంరక్షించాలని సూచించారు.

నూతన బోర్‌వెల్స్ ప్రారంభం కావడంతో ముత్తారం గ్రామం, సూరవీడు కాలనీ ప్రజల్లో ఆనందం వ్యక్తమైంది. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించిందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట సమయంలో తమ గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించిన బాలవికాస్, కాఫేడు సంస్థలకు గ్రామ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామీణ ప్రజల సంక్షేమం, తాగునీటి భద్రత, సమాజాభివృద్ధి కోసం ఇటువంటి సేవా కార్యక్రమాలు మరిన్ని గ్రామాలకు విస్తరించాలని గ్రామస్థులు ఆకాంక్షించారు.

# ఆపదలో ఉన్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ కొండంత అండ: ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

**భద్రాచలం, జూలై 14 డిడి9 వార్త**

ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఎంతో ఊరటనిస్తోందని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి బాధిత కుటుంబానికి అండగా నిలవడమే తమ లక్ష్యమని, ప్రభుత్వం నుంచి అందే ఈ ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలి

- **ఎంఈఓకు వినతిపత్రం అందజేసిన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు**
- **సానుకూలంగా స్పందించిన మండల విద్యాశాఖ అధికారి రమాదేవి**

**భద్రాచలం, జూలై 14 (డిడి9 వార్త)**

ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభంగా సేవలందిస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, వారి పిల్లల చదువుల కోసం పాఠశాల ఫీజుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు కోరారు. మంగళవారం భద్రాచలంలోని మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓ టి. రమాదేవిని కలిసి వారు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) పట్టణ అధ్యక్షుడు విజ్జగిరి రాజా కిరణ్, భద్రాచలం డివిజన్ ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు భూక్యా రంజిత్, ఎల్. శ్రీహరి కుమార్ మాట్లాడుతూ.. జర్నలిస్టులు తక్కువ వేతనాలతో పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలికితీస్తున్నారని, కుటుంబ పోషణ, పిల్లల చదువుల విషయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లా కమిటీ సూచనల మేరకు అక్రిడేషన్ కార్డు కలిగిన జర్నలిస్టుల పిల్లలకు విద్యా సంస్థల్లో 50 శాతం ఫీజు మినహాయింపు ఇచ్చేలా చూడాలని కోరారు. దీనిపై ఎంఈఓ టి. రమాదేవి సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టుల కష్టాలను అర్థం చేసుకున్నామని, ఈ అంశాన్ని జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, ఫీజు రాయితీ అమలయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ కార్యదర్శి జె. జయరాం, ప్రింట్ మీడియా ఉపాధ్యక్షులు కాటా సత్యం, సహాయ కార్యదర్శి బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు మదార్, పట్టణ ఆర్గనైజింగ్ సెక్రటరీ వి. ప్రేమ్ కుమార్, కోశాధికారి బి. నాయుడు, జర్నలిస్టులు ఆర్. వెంకట్, పి. నాగేంద్రబాబు, యం. సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి యజమాన్యం వాస్తవ లాభాలు వెంటనే ప్రకటించండి టి ఎన్ టి యు సి,డిమాండ్.

**డిడి9వార్త / రామగుండం జులై 15:**

సింగరేణి యజమాన్యం వాస్తవ లాభాలు ప్రకటించకుండా ఆర్థిక సంవత్సరం ముగిసి నెలలు గడుస్తున్నప్పటికీ కార్మికులు ఆందోళన చెందుతున్నారు. సింగరేణి ప్రగతికి కార్మికులు పునాదులుగా నిలుస్తున్న సింగరేణి ఉద్యోగులు సమస్త నిర్దేశించిన ఉత్పత్తి 2025 26 ఆర్థిక సంవత్సరానికి 60 మిలియన్ టన్నులు నిర్ణయించగా 58 మిలియన్ టన్నులు ఉత్పత్తి సాధించడం జరిగింది. ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సింగరేణి కార్మికులకు లాభాల వాటాపై తక్షణమే 40 శాతం లాభాల్లో భాగస్వామ్య వాటాను సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాల వాటను ప్రకటించి చెల్లించే తేదీని ఖరారు చేయాలని, అలాగే కాంట్రాక్ట్ కార్మికులకు గత సంవత్సరం 5000 రూపాయలు చెల్లించడం జరిగిందని వారికి కూడా లాభాల్లో వాటాను పదివేల వరకు పెంచి ఇవ్వాలని సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ టి ఎన్ టి యు సి ఎం డి గారికి విజ్ఞప్తి చేశారు. అలాగే పెండింగ్ సమస్యల పరిష్కారం నాలుగు లేబర్ కోడ్ ల రద్దు సొంత ఇంటి పథకం కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతన చట్టం నెలకు 26వేల వేతనం తగ్గకుండా ఇవ్వాలని లేదా కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి. సింగరేణి యాజమాన్యం గతంలో బోర్ వెల్స్ వేసి బొగ్గు నిక్షేపాలు కనుగొన్న శ్రావణ్ పల్లి, కేటీకే సిక్స్, గోలేటి మహావీర్ గని ప్రాంతంలో సర్వే చేసిన గనులకు ఫారెస్ట్ క్లియరెన్స్ తీసుకువచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. మారుపేర్ల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కోల్ బెల్ట్ ప్రాంత ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని వాస్తవ లాభాలను కూడా వెంటనే ప్రకటన చేయాలని లేనియెడల టిఎన్టియుసి ఆధ్వర్యంలో అన్ని జిఎం ఆఫీసుల ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈరోజు గోదావరిఖని టిఎన్టియుసి కార్యాలయంలో రీజియన్ స్థాయి సమావేశంలో కే నిమ్మకాయలు ఏడుకొండలు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మాజీ కార్యదర్శి, సింగరేణి కాల రిస్ లేబర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్, ముదిగంటి దామోదర్ రెడ్డి పెద్దపల్లి పార్లమెంటు టిఎన్టియుసి అధ్యక్షుడు, పెగడపల్లి రాజనర్సు కార్పొరేషన్ అధ్యక్షుడు, కొండి శ్రీనివాస్ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి, బేక్కం వీరేందర్ టిఎన్ఎస్ఎఫ్ మాజీ కార్యదర్శి ,కామెర రాజబాబు రామగుండం మాజీ ఎస్సి సెల్ అధ్యక్షుడు సల్ల రవీందర్ రాష్ట్ర టిఎన్టియుసి నాయకుడు పాత నర్సింగరావు సింగరేణి కాంటాక్ట్ కార్మిక అధ్యక్షుడు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# రైతు సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం వద్దు: రైతు కూలీ సంఘం ఆగ్రహం.

- **సాగునీరు, విద్యుత్, గిట్టుబాటు ధర కల్పించాలి.**
- **డిమాండ్లు నెరవేర్చకపోతే ఆందోళన తప్పదు: లతక్క హెచ్చరిక.**

**మంగపేట జూలై 14డీడీ 9 వార్త**

రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సాగునీటి సరఫరాలో జాప్యం, విద్యుత్ కోతలు, ఎరువులు విత్తనాల కొరతతో పాటు పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఏటూరునాగారం తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జగదీష్‌కు వినతిపత్రం అందజేశారు.

రైతు కూలీ సంఘం నాయకురాలు లతక్క మాట్లాడుతూ... ప్రభుత్వం రైతులను పూర్తిగా మరిచిపోయింది. ఖరీఫ్ సీజన్ వచ్చినా కాలువలకు నీరు లేదు. 9 గంటల కరెంటు అంటారు కానీ 3 గంటలు కూడా సరిగా రావడం లేదు. ఎరువులు, విత్తనాల కోసం గంటల కొద్దీ క్యూలో నిలబడాలి. పండించిన పంటకు కనీస ధర కూడా ఇవ్వడం లేదు. రుణభారంతో రైతు ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలి. లేకుంటే మేము రోడ్డెక్కక తప్పదు."

ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని, పాత రుణాల భారం కారణంగా రైతులు కొత్త రుణాలు తీసుకోలేక సతమతమవుతున్నారని చెప్పారు. ధాన్యంతో పాటు ఇతర పంటలకు కూడా కనీస మద్దతు ధర కల్పించి, కొనుగోలు కేంద్రాలను గ్రామస్థాయిలో ఏర్పాటు చేయాలని కోరారు.

రైతులకు అవసరమైన ప్రభుత్వ సహాయాన్ని తక్షణమే అందించాలని, పంట నష్టపరిహారం, బీమా సొమ్ము వెంటనే చెల్లించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. రైతాంగ సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తమ డిమాండ్లు పరిష్కారం కాకపోతే సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా, మండల నాయకులు పద్మక్క, కొమురయ్య, రమేష్, స్వామి ముస్కు చంద్ర రెడ్డి తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.



# 30వ విడత మెగా ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం – 44 మంది శస్త్రచికిత్సలకు ఎంపిక

**మంగపేట జూలై 14డీడీ 9 వార్త**

వెంకటాపురం మండల కేంద్రంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్య జంపన్న ఆధ్వర్యంలో నిర్వహించిన 30వ విడత మెగా ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. శిబిరంలో కంటి సమస్యలతో బాధపడుతున్న పేదలు, వృద్ధులకు నిపుణులైన వైద్యులు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం శస్త్రచికిత్స అవసరమైన 44 మందిని గుర్తించి, హైదరాబాద్‌లోని శంకర కంటి ఆసుపత్రికి ప్రత్యేక బస్సు ద్వారా తరలించారు.

గత రెండున్నర సంవత్సరాలుగా ములుగు జిల్లాలోని పలు గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ వేలాది మంది నిరుపేదలకు చూపును అందించే సేవా కార్యక్రమాలను భూక్య జంపన్న కొనసాగిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భంగా భూక్య జంపన్న మాట్లాడుతూ, పేద ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నానని చెప్పారు. తప్పుడు ప్రచారాలను పట్టించుకోనని, ప్రజల ఆశీస్సులే తనకు బలమని పేర్కొన్నారు. ప్రజల ఆదరణతో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తానని తెలిపారు.

త్వరలో ములుగు జిల్లాలోని ప్రతి గ్రామానికి, ప్రతి గడపకు వెళ్లి ప్రజల ఆశీర్వాదం కోరనున్నట్లు ఆయన వెల్లడించారు.

శిబిరం ద్వారా లబ్ధి పొందిన పలువురు వృద్ధులు, పేద కుటుంబాలు మాట్లాడుతూ, కంటి సమస్యలతో బాధపడుతున్న తమకు భూక్య జంపన్న అండగా నిలిచారని, ఉచిత వైద్య సేవలు అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వెంకటాపూర్ మాజీ మండల అధ్యక్షులు లింగాల రమణారెడ్డి, మాజీ సర్పంచ్ సాదా యాదగిరి, చంటి భద్రయ్య, బాదావత్ రాజ్‌కుమార్, పోషల్ల వీరమల్లు, నల్ల భద్రయ్య, నరెట్ల విజయేందర్, నూనె రమేష్, సోమిడి రవి, చిక్కుల కళ్యాణి, జహీర్ పాషా, చిగురు దేవేందర్, తోట సంపత్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా పర్యటనకు సర్వం సిద్ధం చేయండి

- **- ఉప ముఖ్యమంత్రి, మంత్రుల పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ అంకిత్**
- **- హెలిప్యాడ్, సమీక్షా వేదిక వద్ద పకడ్బందీ ఏర్పాట్లకు ఆదేశం**

**అశ్వాపురం, జూలై 14 (డిడి9 వార్త)**

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటి పారుదల మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ అంకిత్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సీతమ్మసాగర్, సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుల పరిశీలన, అనంతరం నిర్వహించనున్న సమీక్షా సమావేశం సజావుగా సాగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

**పకడ్బందీగా ఏర్పాట్లు:**

పర్యటనలో భాగంగా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అవసరమైన భద్రతా చర్యలు, బారికేడింగ్, పారిశుద్ధ్యం, పార్కింగ్ వంటి అంశాల్లో ఏమాత్రం లోపం ఉండకూడదని స్పష్టం చేశారు. అమ్మగారిపల్లి వద్ద జరగనున్న సమీక్షా సమావేశానికి సంబంధించి వేదిక, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధుల కోసం చేపడుతున్న సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. సమావేశానికి హాజరయ్యే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**సమన్వయంతో పని చేయండి:**

ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల పరిశీలన పర్యటనను విజయవంతం చేసేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు ప్రోటోకాల్ నిబంధనలు పాటిస్తూ తమ బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ తనిఖీల్లో అశ్వాపురం తహసీల్దార్ సూర్యప్రకాష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు







# భద్రాచలంలో బెల్ట్ షాపులు, మద్యం సిండికేట్‌పై విచారణ జరపాలి

- **ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన బీఆర్‌టీయూ–ఐటీసీ పీఎస్పీడీ యూనియన్ ప్రధాన కార్యదర్శి షేక్ అజీమ్**

**భద్రాచలం, జూలై 14 (డిడి9 వార్త)**

భద్రాచలం ప్రాంతంలో అక్రమ బెల్ట్ షాపుల నిర్వహణ, మద్యం దుకాణాల సిండికేట్ వ్యవస్థ, ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయాలు, సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్‌టీయూ-ఐటీసీ పీఎస్పీడీ యూనియన్ ప్రధాన కార్యదర్శి షేక్ అజీమ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలంలోని ప్రభుత్వ అనుమతి పొందిన మద్యం దుకాణాల యాజమాన్యాలు పరస్పరం కుమ్మక్కై సిండికేట్‌గా ఏర్పడి, అనుమతి లేని ప్రదేశాల్లో భారీ ఎత్తున బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్‌పీ ధర కంటే ప్రతి క్వార్టర్‌పై సుమారు రూ.30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

భద్రాచలం పరిధిలో సుమారు 250 బెల్ట్ షాపులు రోజుకు 100 క్వార్టర్ల చొప్పున విక్రయించి, ఒక్కో క్వార్టర్‌పై రూ.30 అదనంగా వసూలు చేస్తే రోజుకు సుమారు రూ.7.50 లక్షలు, నెలకు రూ.2 కోట్లకు పైగా అక్రమంగా వసూలయ్యే అవకాశం ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ వ్యవహారాన్ని సాధారణ ఉల్లంఘనగా కాకుండా సంఘటిత అక్రమ వ్యాపారంగా పరిగణించి విచారణ జరపాలని కోరారు.

అన్ని బెల్ట్ షాపులపై ప్రత్యేక దాడులు నిర్వహించడం, అక్రమ మద్యం విక్రయదారులు, సరఫరాదారులు, షాపుల యాజమాన్యాలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం, ఎంఆర్‌పీకి మించి విక్రయాలపై కేసులు నమోదు చేయడం, గత మూడు సంవత్సరాల తనిఖీలు, కేసులు, జరిమానాలు, సీజ్ వివరాలను పరిశీలించడం, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా స్వతంత్ర విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.



అదేవిధంగా రామాలయాలు, చర్చిలు, పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రుల సమీపంలోని మద్యం దుకాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దుకాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లోని మద్యం దుకాణాలను తరలించడం లేదా లైసెన్సులను సమీక్షించాలని సూచించారు. జాతీయ రహదారి సమీపంలోని మద్యం దుకాణాల అనుమతులు, నిబంధనల అమలుపై కూడా ప్రత్యేక విచారణ జరపాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.ప్రభుత్వ అనుమతి పొందిన ఐదు వైన్స్ షాపుల్లో అన్ని బ్రాండ్ల మద్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని అక్రమ మద్యం వ్యాపారాన్ని అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టి, విచారణ నివేదికను ప్రజలకు వెల్లడించాలని ఎక్సైజ్ శాఖను షేక్ అజీమ్ కోరారు.

# ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

**మణుగూరు, జూలై 14 (డిడి9 వార్త)**

భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్ల నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని పినపాక నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సంబంధిత బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్లను ఆదేశించారు.

మంగళవారం మణుగూరు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మండలాల వారీగా ఓటర్ల నమోదు పురోగతిని పరిశీలించిన ఆయన, నమోదు ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఇంటింటి సర్వేను వేగవంతం చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం ఉద్దేశం కేవలం ఓటరు జాబితాలోని తప్పులను సరిదిద్దడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం మాత్రమేనని స్పష్టం చేశారు. బూత్ స్థాయి అధికారులు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసే సమయంలో ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించాలని, కుటుంబంలోని అర్హులైన ప్రతి సభ్యుడి వివరాలను ఫారంలో నమోదు చేయించి తిరిగి స్వీకరించిన వెంటనే తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని ఆదేశించారు.

ఓటర్లలో ఎలాంటి అపోహలు, భయాందోళనలు అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ద్వారా మరణించిన వారి పేర్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిన వారి పేర్లు, ఒకే వ్యక్తికి రెండు చోట్ల నమోదైన డూప్లికేట్ ఓట్లను మాత్రమే తొలగిస్తారని, అర్హులైన ఓటర్ల పేర్లను ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా తొలగించే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఈ విషయాలను ప్రతి ఓటరికి బూత్ స్థాయి అధికారులు స్పష్టంగా వివరించాలని సూచించారు.



ఓటర్ల నమోదు తక్కువగా ఉన్న మండలాల తహసీల్దారులతో ఫోన్‌లో మాట్లాడిన బి. రాహుల్, ఈ నెల 24వ తేదీలోపు ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేసేలా బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్లు ఇంటింటి సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు.

సమావేశంలో మణుగూరు తహసీల్దార్ అద్దంకి నరేష్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అనూష, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేష్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణకు ప్రత్యేక సహాయ కేంద్రం ఏర్పాటు:సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట

**భద్రాచలం, జూలై 14 (డిడి9 వార్త )**

ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ-2026 కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా నవీకరణ ప్రక్రియను సులభతరం చేసేందుకు భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలను నింపడం, సమర్పించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓటర్లకు ఎన్నికల సిబ్బంది ప్రత్యక్షంగా సహాయం అందించనున్నట్లు ఆయన మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

సహాయ కేంద్రానికి వచ్చే ఓటర్లు కుటుంబ సభ్యులకు అందిన ఎన్యూమరేషన్ ఫారాలు, ప్రతి సభ్యునికి సంబంధించిన తాజా రంగు ఫొటో, ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు లేదా జనన ధ్రువీకరణ పత్రం వెంట తీసుకురావాలని సూచించారు. కుటుంబంలో ఎవరైనా ఓటరు మరణించి ఉంటే సంబంధిత మరణ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలని తెలిపారు. ఒకవేళ అసలు ధ్రువ పత్రాలు అందుబాటులో లేకపోతే, మొబైల్ ఫోన్‌లో ఉన్న డిజిటల్ లేదా స్కాన్ కాపీలను చూపించినా సరిపోతుందని వివరించారు.



ఈ ప్రత్యేక సహాయ కేంద్రం ప్రతిరోజూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ నెల 20వ తేదీ వరకు పనిచేస్తుందని తెలిపారు. ఇప్పటివరకు తమ ఎన్యూమరేషన్ ఫారాలను సంబంధిత బూత్ స్థాయి అధికారులకు అందజేయని ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకొని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని సందర్శించి ఫారాలను పూర్తి చేసి సమర్పించాలని కోరారు.

భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం, నింపిన ఎన్యూమరేషన్ ఫారాలను సంబంధిత బూత్ స్థాయి అధికారులకు సమర్పించిన ఓటర్ల పేర్లు మాత్రమే ముసాయిదా ఓటరు జాబితాలో చేర్చబడతాయని, ఫారాలు సమర్పించని వారి పేర్లు ముసాయిదా జాబితాలో ఉండవని సబ్ కలెక్టర్ స్పష్టం చేశారు. అందువల్ల ప్రతి ఓటరు తమ వివరాలను సకాలంలో ధ్రువీకరించి, నింపిన ఫారాలను తప్పనిసరిగా సంబంధిత బూత్ స్థాయి అధికారులకు అందజేసి ఓటరు జాబితాలో తమ పేరును కొనసాగించుకునేలా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ తర్వాత టీమిండియా కోచ్‌ల్లో ఒకరు రాజీనామా?




- **టెన్ డూస్కాటే రాజీనామాకు సిద్ధమైనట్లు కథనం**
- **బీసీసీఐకి నిర్ణయం తెలిపినట్లు సమాచారం**
- **ఇంగ్లండ్ సిరీస్ తర్వాత తప్పుకొనే అవకాశం**
- **వ్యక్తిగత కారణాలతోనే నిర్ణయమని సమాచారం**
- **కుటుంబంతో ఎక్కువ సమయం గడపాలని భావన**

**ప్రజాస్వరం:**

భారత క్రికెట్ జట్టు సహాయ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే తన పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇంగ్లండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్ ముగిసిన తర్వాత బాధ్యతల నుంచి తప్పుకోవాలనే తన నిర్ణయాన్ని ఇప్పటికే బీసీసీఐకి తెలియజేసినట్లు క్రిక్‌బజ్ కథనం వెల్లడించింది. బీసీసీఐతో పాటు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ అంగీకరిస్తే, ఇంగ్లండ్‌తో చివరి వన్డే అతడికి భారత జట్టుతో ఆఖరు మ్యాచ్ కానుంది.

టెన్ డస్కాటే నిర్ణయానికి అసంతృప్తి కారణం కాదని క్రిక్‌బజ్ కథనం పేర్కొంది. వ్యక్తిగత కారణాలతో పాటు కుటుంబానికి ఎక్కువ సమయం కేటాయించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. లండన్‌లో నివసిస్తున్న తన కుటుంబంతో ఎక్కువ సమయం గడపడంతో పాటు తక్కువ ప్రయాణాలు ఉండే బాధ్యతలను స్వీకరించాలని అతడు భావిస్తున్నట్లు వెల్లడించింది. రెండేళ్ల క్రితం భారత జట్టు సహాయ కోచ్‌గా టెన్ డస్కాటే బాధ్యతలు చేపట్టాడు. అతడి తొలి ఒప్పందం కూడా ఇటీవలే ముగిసినట్లు సమాచారం. గౌతమ్ గంభీర్ సిఫార్సుతోనే అతడు కోచింగ్ బృందంలో చేరగా, రాజీనామాను ఆమోదించాలా వద్దా అనే విషయంలో గంభీర్‌కు కూడా అభిప్రాయం చెప్పే అవకాశం ఉందని కథనం పేర్కొంది. అయితే అతడి రాజీనామాను అడ్డుకునే అవకాశం చాలా తక్కువగా ఉందని తెలిపింది.

మరోవైపు, భారత మాజీ చీఫ్ సెలెక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్ మాట్లాడుతూ.. ఇంగ్లండ్, ఐర్లాండ్‌తో టీ20 సిరీస్‌ల్లో గంభీర్‌కు పూర్తి స్థాయి జట్టు అందుబాటులో లేదన్నాడు. హార్దిక్ పాండ్యా, జస్‌ప్రీత్ బుమ్రా లేకపోవడం ప్రభావం చూపిందని చెప్పాడు. రెండు సిరీస్‌ల్లో ఓడిపోయినంత మాత్రాన గంభీర్‌ను విమర్శించడం తొందరపాటు అవుతుందని వ్యాఖ్యానించాడు.

# భారత్‌ఇంగ్లండ్ వన్డే సిరీస్..
# ద్రావిడ్ 15 ఏళ్ల రికార్డుపై కోహ్లీ, రోహిత్ కన్ను

- **ఇంగ్లండ్ గడ్డపై ద్రావిడ్ వన్డే రికార్డుకు చేరువలో కోహ్లీ, రోహిత్**
- **అగ్రస్థానం కోసం కోహ్లీకి 68, రోహిత్‌కు 239 పరుగులు అవసరం**
- **దాదాపు 15 ఏళ్లుగా కొనసాగుతున్న రాహుల్ ద్రావిడ్ రికార్డు**
- **టీ20 సిరీస్‌లో ఓటమి తర్వాత సీనియర్లతో బరిలోకి దిగుతున్న భారత్**
- **2027 ప్రపంచకప్ సన్నాహాల్లో భాగంగా ఈ సిరీస్‌కు అధిక ప్రాధాన్యం**




**ప్రజాస్వరం:**

భారత క్రికెట్ జట్టు వెటరన్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఓ అరుదైన రికార్డుకు చేరువలో ఉన్నారు. ఇవాళ్టి నుంచి ఇంగ్లండ్‌తో ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ప్రారంభం కానున్న మూడు వన్డేల సిరీస్‌లో వీరిద్దరూ రాణిస్తే, ఇంగ్లండ్ గడ్డపై వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా నిలిచే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ జాబితాలో భారత జట్టు మాజీ కెప్టెన్ రాహుల్ ద్రావిడ్ అగ్రస్థానంలో ఉన్నాడు.

దాదాపు 15 ఏళ్లుగా ఈ రికార్డు ద్రావిడ్ పేరు మీదే ఉంది. అతను 1996 నుంచి 2011 మధ్య ఇంగ్లండ్‌లో 20 వన్డేలు ఆడి 38.11 సగటుతో 648 పరుగులు చేశాడు. ఇందులో ఏడు అర్ధ సెంచరీలు ఉన్నా, ఒక్క సెంచరీ కూడా లేదు. ఈ జాబితాలో సచిన్ టెండూల్కర్ 17 మ్యాచ్‌ల్లో 639 పరుగులతో రెండో స్థానంలో ఉండగా, ఎంఎస్ ధోనీ 21 మ్యాచ్‌ల్లో 613 పరుగులతో మూడో స్థానంలో ఉన్నాడు.

ప్రస్తుతం నాలుగో స్థానంలో ఉన్న విరాట్ కోహ్లీ, ఈ రికార్డును అధిగమించడానికి కేవలం 68 పరుగులు మాత్రమే దూరంలో ఉన్నాడు. కోహ్లీ ఇప్పటివరకు 16 వన్డేల్లో 38.73 సగటుతో 581 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, నాలుగు అర్ధ సెంచరీలు ఉన్నాయి. మరోవైపు టీమిండియా ఓపెనర్ రోహిత్ శర్మ ఈ ఘనత సాధించాలంటే 239 పరుగులు చేయాల్సి ఉంది. అయితే, ఇంగ్లండ్‌లో రోహిత్ సగటు అద్భుతంగా ఉంది. అతను 10 ఇన్నింగ్స్‌లలోనే 58.57 సగటుతో పరుగులు సాధించాడు. ఇందులో రెండు సెంచరీలు, రెండు అర్ధ సెంచరీలు ఉన్నాయి. అతని అత్యధిక స్కోరు 137 నాటౌట్.

టీ20 సిరీస్‌లో ఎదురైన పరాభవం నేపథ్యంలో ఈ వన్డే సిరీస్ భారత్‌కు అత్యంత కీలకంగా మారింది. ఇంగ్లండ్‌తో జరిగిన నాలుగు టీ20ల సిరీస్‌లో 40తో ఓటమి పాలవ్వడం, అంతకు ముందు ఐర్లాండ్‌లోనూ పరాజయాలు ఎదురవ్వడంతో జట్టు యాజమాన్యం విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, జస్ప్రీత్ బుమ్రా వంటి సీనియర్ ఆటగాళ్లను తిరిగి జట్టులోకి పిలిచింది. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని భారత జట్టుకు 2027 వన్డే ప్రపంచకప్‌కు సన్నాహాల్లో భాగంగా ఈ సిరీస్ ఎంతో ముఖ్యమైనది.

ఐపీఎల్‌లో తొడ కండరాల గాయం కారణంగా ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌కు దూరమైన కోహ్లీ, దేశవాళీ టీ20 టోర్నీలో మంచి ఫామ్‌తో తిరిగి జట్టులోకి వచ్చాడు. మరోవైపు ఇటీవలి కాలంలో ఇంగ్లండ్‌పై వైట్ బాల్ క్రికెట్‌లో రోహిత్ అద్భుతంగా రాణించాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్ కావడంతో కోహ్లీ ఈ రికార్డును సులభంగానే అందుకునే అవకాశం ఉంది. అయితే, రోహిత్ అగ్రస్థానానికి చేరాలంటే సిరీస్‌లో అసాధారణ ప్రదర్శన చేయాల్సి ఉంటుంది. ఈ వెటరన్ ఆటగాళ్లకు బహుశా ఇదే చివరి విదేశీ పర్యటనల్లో ఒకటి కావొచ్చని భావిస్తున్న తరుణంలో వారు రికార్డు సాధించడం అభిమానులకు మరింత ప్రత్యేకంగా నిలవనుంది.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500201. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.